RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY
తెలుగు దినపత్రిక

మల్కాజిగిరి MALKAJGIRI | సంపుటి : 3 VOLUME : 3 | సంచిక : 155 ISSUE NO : 155 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ EDITOR : MERUGU CHANDRAMOHAN | బుధవారం,డిసెంబర్,10,2025 Wednesday,December,10,2025 | పేజీలు : 8 వెల : రూ.4/- PAGES : 8 RS : 4 /-



ఈసారి మా స్పందన చాలా తీవ్రంగా

## ఉంటుంది

భారత్‌కు పాక్ ఆర్మీ చీఫ్ వార్నింగ్

పాకిస్థాన్ : పాకిస్థాన్ తొలి చీఫ్ ఆఫ్ డిఫెన్స్ ఫోర్సెస్ (సీడీఎఫ్)గా నియమితులైన ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్, బాధ్యతలు చేపట్టిన వెంటనే భారత్‌కు మరోసారి హెచ్చరికలు జారీ చేశారు. భవిష్యత్తులో భారత్ దూకుడుగా వ్యవహరిస్తే, ఇస్లామాబాద్ స్పందన మరింత 'వేగంగా, తీవ్రంగా, బలంగా' ఉంటుందని స్పష్టం చేశారు. "భారత్ ఎలాంటి భ్రమల్లోను ఉండకూడదు" అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. గౌరవ వందనం స్వీకరించిన అనంతరం అధికారులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. కొత్తగా ఏర్పాటు చేసిన డిఫెన్స్ ఫోర్సెస్ హెడ్‌క్వార్టర్స్ ఒక 'చారిత్రాత్మక' నిర్ణయమని మునీర్ అభివర్ణించారు.




రాష్ట్ర అభివృద్ధికి పెద్ద

## ఊతం

- రెండో రోజు మొత్తం రూ.1,11,395 కోట్ల పెట్టుబడులు
- సిఎం రేవంత్ సమక్షంలో పలు కంపెనీల ఒప్పందాలు

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** తెలంగాణ ప్రభుత్వం ఫ్యూచర్ సిటీలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న రైజిం గ్ గ్లోబల్ సమిట్ రెండో రోజు భారీ పెట్టుబడులు సమకూరాయి. వివిధ కంపెనీలు తమ పెట్టుబడులను ప్రకటించాయి. ఈ మేరకు సిఎం రేవంత్ సమక్షంలో పలు ఒప్పందాలు సాగాయి. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు దేశ, విదేశాలకు చెందిన వివిధ కంపెనీలు ఆసక్తి చూపిస్తున్నాయి. వివిధ కంపెనీల ప్రతినిధులతో వరుస సమావేశాలతో సీఎం రేవంత్‌రెడ్డి బిజీ బిజీగా ఉన్నారు. ఆయన సమక్షంలో పలు కంపెనీలు ఎంవోయూలు కుదుర్చుకుంటున్నా యి. తాజాగా సీఎం రేవంత్‌రెడ్డితో గోద్రెజ్ జెర్సీ సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ ఫిరోజ్ షా గోద్రెజ్, గ్రూప్ ప్రెసిడెంట్ రాకేశ్ స్వామి సమావేశమ య్యారు. హైదరాబాద్‌లో తమ సంస్థ విస్తరణపై ఫిరోజ్‌షా గోద్రెజ్ సీఎంతో చర్చించారు.



జపాన్‌లో భారీ

## భూకంపం

- రిక్టార్ స్కేల్‌పై 7.2 తీవ్రత నమోదు
- భారీగా ఎగసిపడుతున్న రాకాసి అలలు
- సునామీ హెచ్చరికలు జారీ!

హొక్కైడో, డిసెంబర్9 : జపాన్ తీరంలో తీవ్ర భూకపం తలెత్తింది. భూకంపం తీవ్రత రిక్టార్ స్కేల్‌పై దాదాపు 7.2గా నమోదైంది. సముద్రం అలలు 10 అడుగుల మేర ఎగసిపడుతున్నాయి. దీంతో అక్కడి ప్రభుత్వం సునామీ హెచ్చరికలు జారీ చేసింది. ముఖ్యంగా ఉత్తర జపాన్ అంతటా సునామీ హెచ్చరికలు జారీ చేయబడ్డాయి. జపాన్ తూర్పు తీరంలో సంభవించిన భారీ భూకంపం కారణంగా సునామీ హెచ్చరికలు జారీ చేశారు. స్థానిక కాలమానం ప్రకారం రాత్రి 9.13 గంటల సమయంలో ఈ భూకంపం సంభవించింది. ఇది 30 మైళ్ల కంటే ఎక్కువ లోతులో కేంద్రీక ృతమై ఉంది. దీంతో అక్కడి అధికారులు హొక్కైడో, అమోరి, ఇవాటే ప్రిఫెక్చర్ల పసిఫిక్ దీవులకు ముందస్తు సునామీ హెచ్చరికలు జారీ చేశారు.



తెలంగాణలో

## చలి పంజా

- గణనీయంగా పెరిగిన చలి తీవ్రత
- సాధారణంకంటే కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు

హైదరాబాద్, డిసెంబర్9 ,తెలంగాణ దిశ : తెలంగాణలో చలి తీవ్రత గణనీయంగా పెరిగింది. కనిష్ట ఉషో?గ్రతలు సాధారణం కంటే 3-4 డిగ్రీలు తగ్గాయి. రానున్న నాలుగు రోజులు చలి మరింత పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ సూచించింది. సంగారెడ్డి జిల్లా కోహిర్‌లో అత్యల్పంగా 7.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. దాదాపు అన్ని జిల్లాల్లో కనిష‘ ఉషోగ్రతలు సాధారణం కంటే 3 నుంచి 4 డిగ్రీల మేర తగ్గాయి. ముఖ్యంగా సాయంత్రం 6 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు దట్టమైన పొగమంచు కమ్ముకోవ డంతో రహదారులపై దృశ్యత తగ్గి, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

## నన్ను కూర్చోబెట్టేది ఎవరు?

- మా వల్లే వందేమాతరానికి అన్యాయం
- కాంగ్రెస్‌వి బుజ్జగింపు రాజకీయాలు
- ప్రతిపక్షాలపై మండిపడ్డ రాజ్‌నాథ్ సింగ్
- లోక్‌సభలో సహనం కోల్పోయిన రక్షణ మంత్రి



న్యూఢిల్లీ, : లోక్‌సభలో 'వందేమాతరం' గీతంపై జరిగిన చర్చ తీవ్ర వాగ్వాదానికి దారితీసింది. చర్చ సందరంగా తన ప్రసంగానికి ప్రతిపక్ష సభ్యులు పదేపదే అడ్డుతగలడంతో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "నన్ను కూర్చోబెట్టేది ఎవరు? ఎవరు కూర్చోబెడతారు?" అంటూ వారిపై విరుచుకుపడ్డారు. "ఏం మాట్లాడుతు న్నారు మీరు.. కూ ర్చోండి!" అని గట్టిగా హెచ్చరించారు. స్పీకర్ ఓం బిర్లా జోక్యం చేసుకుని సభ్యులను శాంతపరచాల్సి వచ్చింది. సోమవారం లోక్‌సభలో 'వందేమాత రం' అంశంపై చర్చ జరిగింది. ఈ సందరంగా రాజ్‌నాథ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తన బుజ్జగింపు రాజకీయాల కోసం జాతీయ గీతమైన 'వందేమాతరం'ను ముక్కలు చేసిందని తీవ్ర ఆరోపణలు చేశారు. జవహర్ లాల్ నెహ్రూ కాలం నుంచే ఈ అన్యాయం మొదలైం దని విమర్శించారు. వందేమాతరం గీతానికి జరిగిన అన్యాయం కేవలం ఒక పాటకు మాత్రమే కాదని, యావత్ స్వతంత్ర భారత ప్రజలకు జరిగిందని ఆయన అన్నారు. అంతకుముందు, ప్రధాని నరేంద్ర మోదీ ఈ చర్చను ప్రారంభిస్తూ వందేమాతరం 150 ఏళ్లు పూర్తి చేసుకోవడం చారిత్రాత్మకమని అన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో ఈ గీతం కీలక పాత్ర పోషించిందని గుర్తుచేశారు. వందేమాతరం వందేళ్లు పూర్తి చేసుకున్న సమయంలో కాంగ్రెస్ దేశంలో ఎమర్జెన్సీ విధించి రాజ్యాంగాన్ని అణచివేసిందని విమర్శించారు. ఈ చర్చపై కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ వాద్రా స్పందించారు. బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలను ద ృష్టిలో పెట్టుకునే బీజేపీ ఈ అంశాన్ని తెరపైకి తెచ్చిందని, ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించే ప్రయత్నమే ఇదని ఆరోపించారు.




వ్యక్తిగత వైరమే టారీఫ్ పెంపుకు

## కారణం

- రష్యా చమురు కొనుగోళ్లు కారణం కాదు
- ఆర్బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్

న్యూఢిల్లీ, డిసెంబర్9 : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్ పై భారీ మొత్తంలో సుంకాలు విధించిన విషయం తెలిసిందే. రష్యా నుంచి చమురు కొనుగోలు చేయడమే కారణమని ట్రంప్ చెప్పినప్పటికీ అసలు కారణం మాత్రం ఇది కాదని ఆర్బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ పేర్కొన్నారు. రష్యా చమురు కొనుగోళ్లు కేవలం ఒక సాకు మాత్రమేనని, వ్యక్తిగత వైరమే అసలు కారణమని ఆయన చెప్పారు.




సర్పంచ్ అభ్యర్థి

## ఆత్మహత్య

ఓటమి భయంతో ఘాతుకం
సంగారెడ్డి జిల్లాలో ఘటన

**హైదరాబాద్,తెలంగాణ దిశ:** తెలంగాణలో జరుగుతున్న పంచాయతీ ఎన్నికల ప్రక్రియ తీవ్ర ఒత్తిడితో కూడిన వాతావరణంలో సాగుతోంది. ఈ క్రమంలో పలుచోట్ల విషాదకర సంఘటనలు చోటుచేసుకున్నాయి. సంగారెడ్డి, రంగారెడ్డి జిల్లాల్లో ముగ్గురు అభ్యర్థులు మృతి చెందగా, సిద్దిపేట జిల్లాలో ఓ అభ్యర్థిపై కేసు నమోదైంది. సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలం పిప్పడ్‌పల్లి గ్రామ సర్పంచ్‌గా కాంగ్రెస్ మద్దతుతో పోటీ చేస్తున్న సీహెచ్ రాజు (36) ఆత్మహత్య చేసుకున్నారు. ఎన్నికల్లో ఓడిపోతాననే ఆందోళనతో, నమ్మినవాళ్లే ప్రచారానికి రావడం లేదన్న మనోవేదనతో ఆయన చెట్టుకు ఉరేసుకుని మరణించారు.ఆదివారం రాత్రి తోటి అయ్యప్ప స్వాములతో తన ఆవేదన పంచుకోగా, వారు ధైర్యం చెప్పినప్పటికీ సోమవారం ఉదయం ఆయన విగతజీవిగా కనిపించారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మరో ఘటనలో రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం మంచర్లగూడలో 8వ వార్డుకు పోటీ చేస్తున్న పల్లె లత (42) ప్రచారం నిర్వహిస్తుండగా గుండె నొప్పితో కుప్పకూలిపోయారు.



ప్రయాణికుల సమస్యలపై

## ఆరాతీయండి

- ఉన్నతాధికారులకు కేంద్ర మంత్రి ఆదేశం
- ఇండిగో సంక్షోభంపై మంత్రి రామ్మోహన్ దృష్టి
- ఎయిర్‌పోర్టులకు ప్రత్యేక బృందాల తరలింపు
- కొనసాగుతున్న ఇండిగో సంక్షోభం

న్యూఢిల్లీ,డిసెంబర్9 : ఇండిగో విమాన సర్వీసుల్లో ఏర్పడిన అంతరాయం కారణంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ రంగంలోకి దిగింది. దేశవ్యాప్తంగా విమానాశ్రయాల కార్యకలాపాలపై 24 గంటల సమీక్షను ప్రారంభించినట్లు కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు.

# వృద్ధుల కోసం బ్రహ్మాకుమారీస్ 'సంగం' ప్రాజెక్టు

## - వృద్ధుల కోసం జాతీయస్థాయిలో
## - బ్రహ్మకుమారీస్-కేంద్ర ప్రభుత్వం సంయుక్తంగా 'సంగం' ప్రాజెక్టు
## -సైలెన్స్ రిట్రీట్ సెంటర్ లో ఘనంగా ప్రారంభం
## -వృద్ధుల సంక్షేమానికి రాష్ట్ర వ్యాప్తంగా కార్యక్రమాలు





**హైదరాబాద్, డిసెంబర్ 09, (తెలంగాణ దిశ) :** వృద్ధుల సంక్షేమం కోసం కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ బ్రహ్మాకుమారీస్ ఆధ్యాత్మిక సేవా సంస్థతో కలిసి ꞉సంగం' పేరుతో జాతీయ స్థాయి ప్రాజెక్టును ప్రారంభించింది. కుటుంబంలో, సమాజం లో వృద్ధుల్ని గౌరవించే భారతీయ సంస్కృతిని వ్యాప్తి చేయటం, వయోధికులు మానసిక- శారీరక ఆరోగ్యంతో ఆనందంగా ఉండటంకోసం "ఏజ్ విత్ ప్రైడ్, లివ్ విత్ డిగ్నిటీ (గౌరవంగా వృద్ధా ప్యం,హుందాగా జీవనం)" నినాదంతో తెలుగు రాష్ట్రాల్లో ఈ ప్రాజెక్టును ఘనంగా ప్రారంభించారు. మంగళవారం బీబీ నగర్ సమీపంలోని బ్రహ్మాకుమారీస్-సైలెన్స్ రిట్రీట్ సెంటర్‌లో 'సంగం' ప్రాజెక్టును వందకు పైగా వృద్ధాశ్రమాల నిర్వాహకుల సమక్షంలో ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టులో భాగంగా గ్రామీణ స్థాయి వరకు స్థానిక ప్రభుత్వాలు, బ్రహ్మ కుమారీస్ సేవా కేంద్రాలు కలసి సంయుక్తంగా చేపట్టబోయే సంక్షేమ కార్యక్రమాలు, మానసిక ప్రశాంతత-శారీరక ఆరోగ్య శిక్షణ శిబిరాల గురించి వివరించారు. సైలెన్స్ రిట్రీట్ సెంటర్ డైరెక్టర్లు బికె. రాజ కుమారీ, బికె. సునీత ఆధ్వర్యంలో నిర్వ హించిన ఈ కార్యక్రమంలో వృద్ధుల సంక్షేమం కోసం కృషి చేస్తున్న ప్రతినిధులను సత్కరించారు. బ్రహ్మ కుమారీస్ అంతర్జాతీయ ముఖ్య కేంద్రం నుంచి వచ్చిన సమజాసేవ నిపుణులు వృద్ధాశ్రమాల నిర్వాహకులకు ధ్యాన యోగ-వ్యక్తిత్వ నైపుణ్యాల శిక్షణ అందించారు. బ్రహ్మాకుమారీస్ సోషల్ వింగ్ వైస్ చైర్మన్ బికె. ప్రేమ్ కుమార్, బికె. వీరేందర్, బికె. గిరీశ్, తెలంగాణ రాష్ట్ర సీనియర్ సిటిజన్ స్టేట్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ జి. నాగేశ్వర రావు, వివిధ రాష్ట్ర, జిల్లా స్థాయిల సీనియర్ సిటిజన్ అసోసియేషన్ల నాయకులు పాల్గొన్నారు.



# ఘనంగా ఏఐసీసీ అగ్ర నేత సోనియా గాంధీ జన్మదిన వేడుకలు

## - కోట్లాది మందికి ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చిన నాయకురాలు సోనియా గాంధీ
## - కాంగ్రెస్ పార్టీ ఏఎస్ రావునగర్ డివిజన్ అధ్యక్షుడు కేశెట్టి ప్రసాద్







**ఏఎస్ రావునగర్, డిసెంబర్ 09, తెలంగాణ దిశ) :**డాక్టర్ ఏఎస్ రావునగర్ డివిజన్ పరిధిలోని రాధికా చౌరస్తాలో మంగళవారం ఏఐసీసీ అగ్రనేత, దేశ ప్రజల గుండెల్లో ప్రత్యేక స్థానం సంపాదించిన సోనియా గాంధీ జన్మదిన వేడుకలను మంగళవారం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా నాయకులు కేక్ కట్ చేసి స్థానికులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఏఎస్ రావునగర్ డివిజన్ అధ్యక్షుడు కేశెట్టి ప్రసాద్ మాట్లాడుతూ సోనియా గాంధీ భారత రాజకీయాల్లో సేవ, త్యాగం, నిబద్ధతకు ప్రతీక అని అన్నారు. దేశం కోసం, ప్రజల కోసం, రాజ్యాంగ విలువల కోసం ఆమె చేసిన పోరాటం చిరస్మరణీయమన్నారు. అధికారానికి దూరంగా ఉండి కూడా భారత ప్రజాస్వామ్యాన్ని కాపాడడంలో ఆమె పాత్ర అపారమైనదన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి కీలక శక్తిగా నిలిచి కోట్లాది మందికి ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చిన నాయకురాలు సోనియా గాంధీ అని అన్నారు. ఆమె చూపిన మార్గంలో కాంగ్రెస్ పార్టీ అడుగు ముందుకు వేస్తూ ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కట్టుబడి ఉందని ప్రసాద్ అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పజ్జూరి పావనిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాఘువరెడ్డి, పెద్ది శ్రీనివాస్, భూపాల్ రెడ్డి, అజీజ్, లింగస్వామి, బాల నరసింహ, సందీప్ గౌడ్, విల్సన్, శ్రీనివాస్, కిరణ్, ఎస్ ఎం. సాహెబ్ ఎస్ కె సలీమ్, ఎం. పీరా ,అల్లా బక్షి, దస్తగిరి, ఎం. మిట్టు, హరినాథ్, ఉపేందర్ రెడ్డి, యాదగిరి రెడ్డి, ఖాశీం వాలి, ఎస్ కె. సుభానీ, రహమతుల్లా ఖాన్, హుస్సేన్ ఖాన్, హుస్సేన్ వాలి, ఎ. సత్తార్, ఎస్ఎం. బాషా, ఎం. సుభాన్, కె. నారాయణ, కుల్లప్ప, మస్తాన్ సాహెబ్, కె. అక్బర్, ఎస్. రహమతుల్లా, ఎస్. నరసింహ, పివివి సత్యనారాయణ, షేక్ జానీ, కె. విజయలక్ష్మి, హెచ్. మహాలక్ష్మి, కీర్తి, రాణి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణకు ప్రపంచ గుర్తింపు తెచ్చిన నాయకుడు కేసీఆర్

## - బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్





**కుత్బుల్లాపూర్, డిసెంబర్ 09, (తెలంగాణ దిశ) :** విజయ్ దివాస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజక వర్గం చింతల్ లోని కుత్బుల్లాపూర్ నియోజక వర్గ బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన వేడుకలకు బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై తెలంగాణ తల్లి చిత్రపటానికి, బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమైక్య పాలకుల పాలనలో అడుగడుగునా వివక్షతకు గురైన తెలంగాణ ప్రాంతాన్ని స్వరాష్ట్ర సాధనే లక్ష్యంగా బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేపట్టిన దీక్షతో దిగివచ్చిన నాటి యూపీఏ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తామని ప్రకటించిన రోజే విజయ్ దివస్ అని, దీనికి గుర్తుగానే ప్రతి సంవత్సరం డిసెంబర్ 9న మనం చేపడుతున్న విజయ్ దివస్ కార్యక్రమాన్ని అన్నారు. నాటి పాలకుల అడుగడుగునా వివక్షతకు గురైన తెలంగాణ రాష్ట్రాన్ని ప్రపంచ పటంలో సగర్వంగా నిలిపిన నాయకుడు కేసీఆర్, కెసిఆర్ నేతృత్వంలోని బిఆర్ఎస్ పార్టీయే తెలంగాణ ప్రజలకు శ్రీరామరక్ష అని అన్నారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మానవ హక్కుల పరిరక్షణకు కృషి చేస్తాం







**కాప్రా, డిసెంబర్ 09, (తెలంగాణ దిశ) :**మానవ హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తామని మానవ హక్కుల పరిరక్షణ కమిటీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ ఆర్ వి. లక్ష్మి అన్నారు. డిసెంబర్ 10న అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా కాప్రాలో మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ గౌరవం, స్వేచ్ఛ, న్యాయం, వివక్ష లేకుండా అందరికీ ప్రాథమిక హక్కుల గురించి అవగాహన కల్పించడానికి ఇది ప్రత్యేకమైన రోజు అని ఆమె గుర్తు చేశారు. ఐక్యరాజ్యసమితి సార్వత్రిక మానవ హక్కుల ప్రకటన (యుడిహెచ్ఆర్) ఆమోదించిన రోజును గుర్తుచేసుకుంటూ, మానవ హక్కుల రక్షణ, వాటిని కాలరాసే దురాగతాలను అరికట్టడం కోసం ప్రపంచవ్యాప్తంగా ప్రజలందరికీ సమాన హక్కులు, గౌరవం, స్వేచ్ఛ, న్యాయం అందించే లక్ష్యంతో ఈ రోజును జరుపుకుంటామని అన్నారు. ఈ సమావేశానికి మల్కాజిగిరి పార్లమెంట్ అధ్యక్షులు వెంకటేష్ చారి, ఉప్పల్ నియోజకవర్గ అధ్యక్షులు తాదూరి గగన్ కుమార్, సభ్యులు రమేష్, మంజుల, ఆకుల పద్మావతి మంగమ్మ, నర్సింహా చారి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఏఐసీసీ అగ్రనేత సోనియా గాంధీ జన్మదిన వేడుకలు





**కుత్బుల్లాపూర్, డిసెంబర్ 09, (తెలంగాణ దిశ) :**తెలంగాణ రాష్ట్ర సాధనను సహకారం చేసిన ఏఐసీసీ అగ్రనేత సోనియా గాంధీ జన్మదిన వేడుకలను మంగళవారం బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజక వర్గ ఇంచార్జీ కొలన్ హన్మంత్ రెడ్డి కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో సోనియా గాంధీ పాత్ర అపారమని పేర్కొన్నారు. తెలంగాణ సాధన కోసం ఎన్నో ఒడిదుడుకులు వచ్చినప్పటికీ, పజాభిప్రాయాన్ని గౌరవిస్తూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ప్రకటించిన మహనీయురాలు సోనియా గాంధీ అని అన్నారు. కాంగ్రెసు పార్టీ ఎప్పుడూ ప్రజల కోసం పనిచేసిందని, భవిష్యత్తులో కూడా ప్రజల సమస్యల పరిష్కారానికే అత్యంత ప్రాధాన్యం ఇవ్వబోతున్నామని ఆయన తెలిపారు. నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ బలాన్ని ప్రజల మధ్యకు తీసుకెళ్లి, తెలంగాణ అభివృద్ధి పథంలో మరోసారి కాంగ్రెస్ ప్రభుత్వం రావడానికి కృషి చేయాలని పిలుపు నిచ్చారు. సోనియా గాంధీ సంపూర్ణ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ప్రజాసేవలో మరెన్నో అడుగులు ముందుకు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చీమలకొండూర్ లో ఘనంగా దీక్షా విజయ్ దివస్



**భువనగిరి, డిసెంబర్ 09, (తెలంగాణ దిశ) :**తెలంగాణ ఉద్యమ సారథి కేసీఆర్ స్వరాష్ట్రం కోసం 11 రోజులు ఆమరణ దీక్ష చేపట్టి ఢిల్లీ మెడలు వంచిన రోజు అని బిఆర్ఎస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు చింతల వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం చీమలకొండూర్ గ్రామంలో బీజాల లక్ష్మయ్య ఫౌండేషన్ వృద్ధుల ఆశ్రమం లో పండ్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 9 ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు ప్రకటన వెలువడి, తెలంగాణ ప్రజల ఆకాంక్షల సాకారానికి తొలి అడుగు పడ్డ చారిత్రక రోజు అని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు చింతల వెంకటేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బూడిద బిక్షమయ్య గౌడ్, భువనగిరి సింగిల్ విండో చైర్మన్ నోముల పరమేష్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నల్లమస రమేష్ గౌడ్, చందుపట్ల రాజేశ్వర్ రావు, కటిక జంగయ్య, జిల్లా నాయకులు కుతాడి సురేష్, వల్లపు విజయ్, దండబోయిన బాలరాజు యాదవ్, పల్లెపాటే రవి కుమార్, మోతే మనోహర్, మిర్యాల శేషు, నాగారం నరేష్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# అయ్యప్ప స్వామి ఆలయాన్ని సందర్శించిన బిగ్ బాస్ సీజన్ 7 విజేత పల్లవి ప్రశాంత్ కన్నె స్వామి



బిగ్ బాస్ సీజన్ 7 విజేత పల్లవి ప్రశాంత్ కన్నె స్వామి, మంగళవారం కమలానగర్ అయ్యప్ప స్వామి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు గురు స్వాములు ప్రశాంత్ కు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయంలోని అయ్యప్ప స్వాములు కన్నే స్వామి పల్లె ప్రశాంత్ తో ఫోటోలు దిగేందుకు ప్రయత్నించడంతో ఆలయంలో సందడి వాతావరణం నెలకొంది. గురు స్వాములు బండే గౌడ, అంజయ్య, రమేష్ యాదవ్ గురు స్వాములు స్వాగతం పలికి సన్మానం చేశారు.

**(ఏఎస్ రావునగర్, తెలంగాణ దిశ)**

# సంపాదకీయం

## పారిశ్రామిక తిరోగతి..!

గత నాలుగేళ్ళలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది పారిశ్రామిక ఉత్పత్తిలో తగ్గుదల నమోదు కావటం భారత ఆర్థిక వ్యవస్థకు ఒక ప్రమాద ఘంటిక. సామాన్య ప్రజల కొనుగోలు శక్తి నానాటికీ తగ్గుతున్న దాని పర్యవసానమే ఈ పరిస్థితి! భారత ఆర్థిక వ్యవస్థ అద్భుతంగా పురోగమిస్తున్నదని గత కొంతకాలంగా ఢంకా భజాయి స్తున్న మోడీ సర్కారు పనితీరుకు ఇది అక్షరాలా ప్రతికూల నివేదిక. ప్రజల ఆర్థిక స్థితి రోజురోజుకూ దిగజారుతున్నదని, గత్యంతరం లేని పరిస్థితుల్లో– ప్రజలు తమ రోజువారీ జీవన వ్యయాన్ని కూడా తగ్గించుకుంటున్నారని కేంద్ర గణాంకాల శాఖ విడుదల చేసిన పారి శ్రామిక ఉత్పత్తి సూచి (ఐఐపి) తేటతెల్లం చేస్తోంది. గడిచిన ఆర్థిక సంవత్సరం ప్రధాన పారిశ్రామిక రంగాలన్నీ ఉత్పత్తిలో గణనీయంగా తగ్గుదలను నమోదు చేశాయి. కోవిడ్ ఉత్పాతం తరువాత ఇంత తక్కువ వృద్ధి రేటు నమోదు కావడం ఇదే మొదటిసారి. 2021 –22లో 11.4 శాతంగా నమోదైన వృద్ధి రేటు ఈ ఏడాది 4 శాతానికే పరిమితం అయింది. 2023 %–% 24 ఆర్థిక సంవత్సరంతో పోల్చి చూసినా ఇది 1.9 శాతం తక్కువగా ఉంది. మేకిన్ ఇండియా పేరిట కేంద్ర ప్రభుత్వం హడావిడి చేస్తున్నప్పటికీ– అంకెల్లో వ్యక్తమవుతున్న వాస్తవ దృశ్యం ఇదీ! ప్రజల ఆదాయాన్ని పెంచే చర్యలు చేపట్టకుండా పాలకులు ఎన్ని ప్రగల్భాలు పలికినా ఫలితం ఉండదు అనటానికి ఐఐపి నివేదిక నిదర్శనం. మోడీ ప్రభుత్వం కార్పొరేటు అనుకూల విధానాలను నెత్తిన వేసుకొని, ప్రైవేటీకరణను పెద్దఎత్తున ప్రోత్సహిస్తోంది. అంబానీ, అదానీ తదితరులకు లాభాలను దోచిపెట్టేలా పనిగట్టుకొని ప్రభుత్వరంగ సంస్థలను దెబ్బ తీస్తోంది. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని దేశ యువతకు ఆశ కల్పించి, గద్దెనెక్కాక ఆ మాటనే పూర్తిగా మర్చిపోయింది. ప్రజలు దానిని గుర్తు చేస్తుంటే– జీవన ప్రమాణాల మెరుగుదలకు ఏవిధంగానూ దోహదపడని ఉన్మాదం, ఉద్రేకాల వైపు యువతీ యువకులను మళ్లిస్తోంది. ఉదార ఆర్థిక విధానాల్లో భాగంగా శాశ్వత నియామకాలకు స్వస్తి చెప్పి, అన్నింటా కాంట్రాక్టు, ఔట్ సోర్సింగు పద్ధతుల్లోనే ఉద్యోగులను నియమిస్తోంది. ఆఖరికి దేశభద్రతకు అత్యంత కీలకమైన రక్షణరంగంలోనూ లక్షలాది పోస్టులూ ఖాళీగా ఉన్నా– అగ్నివీర్ పేరిట తాత్కాలిక నియామకాలతోనే కాలయాపన చేస్తోంది. గ్రామీణ ప్రజలకు కాస్త ఆదాయాన్ని గ్యారంటీ చేసే ఉపాధి హామీ చట్టాన్ని ఏటేటా నిధులు తగ్గించటం ద్వారా నిర్వీర్యం చేస్తూ వస్తోంది. గ్రామీణ భారతానికి వెన్నెముకలా ఉన్న వ్యవసాయరంగం రాయితీల తగ్గింపు, అరకొర మద్దతు ధరతో నానాటికీ కుదేలవుతోంది. సాఫ్ట్‌వేర్ మొదలుకొని ప్రతి ప్రైవేటు, కార్పొరేటు రంగంలోనూ ఉద్యోగులపై పనిభారం పెంచటం, నిజవేతనాలు తగ్గించటం కొన్నేళ్లుగా సాగుతోంది. వీటన్నింటి పర్యవసానంగా ప్రజల ఆదాయాలు తగ్గి, కొనుగోలు శక్తి క్షీణించిపోతోంది. ఆహారం, బట్టలు తదితర రోజువారీ వినియోగ వస్తువులపై ప్రజల ఖర్చు గతేడాదితో పోలిస్తే 4.7 శాతం తగ్గినట్టు కన్జ్యూమర్ నాన్ డ్యూరబుల్ పద్దు స్పష్టం చేస్తోంది. రోజువారీ అవసరాలను తీర్చుకోలేని స్థితిలో ప్రజలున్నారని చెప్పటానికి ఇది సూచిక. వాహనాలు, గృహోపకరణాలు వంటి వినిమయ వస్తువుల ఉత్పత్తి కూడా మందగించింది. నెలవారీ చెల్లింపుల (ఇఎంఐ) పద్ధతిని కంపెనీలు ప్రోత్సహిస్తున్నాయి కాబట్టే– ఈ రంగంలో ఈపాటి కొనుగోళ్ళు అయినా జరుగుతున్నాయి. ఆర్థికమాంద్యం ఆవరిస్తున్న పరిస్థితుల్లో రానున్న కాలంలో పారిశ్రామిక ఉత్పత్తి మరింత క్షీణించే ప్రమాదముందని ఆర్థికవేత్తల హెచ్చరిక. అమెరికా విధిస్తున్న పన్నుల భారం కూడా మన ఎగుమతులపై తీవ్రంగా ఉంటుంది. ఆక్వా తదితర రంగాలపై ఆ ప్రభావం ఇప్పటికే పడింది. ఈ నేపథ్యంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధి గురించి కబుర్లతోనే కాలక్షేపం చేయకుండా– క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవాలకు అనుగుణంగా వ్యవహరించాలి. ప్రజల నిజ వేతనాలను పెంచే ముమ్మర చర్యలు చేపట్టాలి. పైకి ఆడంబరంగా కనిపించే ఉదార ఆర్థిక విధానాలు కార్పొరేట్లకు లాభాలు కురిపించి, సామాన్యులకు అంతకుమించిన కష్టనష్టాలను చవి చూపిస్తాయన్న వాస్తవం ఇప్పటికే ఆచరణలో తేలిపోయింది. వ్యవసాయ రంగాన్ని, ప్రభుత్వరంగాన్ని బలోపేతం చేయడం ద్వారా ప్రజల కొనుగోలుశక్తిని పెంచాలి. తద్వారా పారిశ్రామిక, ఆర్థిక రంగాలను మెరుగుపరచాలి.

# నాచారంలో ఘనంగా సోనియా గాంధీ జన్మదిన వేడుకలు






### - భారత రాజకీయాల్లో సేవ, త్యాగం, నిబద్ధతకు ప్రతీక సోనియా గాంధీ
### - తెలంగాణ టీపీసీసీ లేబర్ సెల్ ఉపాధ్యక్షులు వివిఎస్ ప్రకాష్ రెడ్డి...

**నాచారం, డిసెంబర్ 09, (తెలంగాణ దిశ)** :కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జీ మందుముల పరమేశ్వర్ రెడ్డి ఆదేశాలు మేరకు కాంగ్రెస్ పార్టీ తెలంగాణ టీపీసీసీ లేబర్ సెల్ ఉపాధ్యక్షులు వివిఎస్ ప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నాచారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రాంగణంలో ఏఐసిసి అగ్రనేత సోని యా గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సోనియాగాంధీ చిత్రపటం వద్ద కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. అనంతరం వివిఎస్ ప్రకాష్ రెడ్డిచేతుల మీదుగా మహంకాళి గుడి కమిటీ సభ్యులకి సన్మానించారు. ఈ సందర్భంగా ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూసోనియా గాంధీ భారత రాజకీయాల్లో సేవ, త్యాగం, నిబద్ధతకు ప్రతీక అని అన్నారు. దేశం కోసం, ప్రజల కోసం, రాజ్యాంగ విలువల కోసం ఆమె చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. అధికారానికి దూరంగా ఉండి కూడా భారత ప్రజాస్వామ్యాన్ని కాపాడడంలో ఆమె పాత్ర అపారమైనదన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి కీలక శక్తిగా నిలిచి కోట్లాది మందికి ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చిన నాయకురాలు సోనియా గాంధీ అని అన్నారు. ఆమె చూపిన మార్గంలో కాంగ్రెస్ పార్టీ అడుగు ముందుకు వేస్తూ ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కట్టుబడి ఉందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మెతుకు శ్రీనివాస్ రెడ్డి, కృష్ణ యాదవ్, నర్సింగ్ రావు, షర్ఫుద్దీన్, సునీల్ రెడ్డి, నాగేష్, నరేష్, సిహెచ్. నరేష్, ఫిరోజ్, రేవంత్, శ్రీనివాస్ రెడ్డి, నరేష్, యూసుఫ్, అక్యుబ్, సురేష్, మహిళా నాయకులు ఉమా, విజయమ్మ, యాస్మిన్, మమత పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మూడు దశల్లో పంచాయితీ ఎన్నికలు

హైదరాబాద్,: తెలంగాణలో పంచాయతీ రాజ్ సంస్థల ఎన్నికలు డిసెంబర్ 11, 14, 17 తేదీల్లో మూడు దశలుగా జరిగే అవకాశం ఉంది. నోటిఫికేషన్ ఈ నెలా 26 లేదా 27న ప్రకటించనున్నారు. పంచాయతీలకు ఆర్థిక సంఘం నిధులు ఫ్రీజ్ కావడంతో ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. బీసీ రిజర్వేషన్ల వివాదం కారణం ఇప్పటి వరకూ ఆలస్యం అవుతూ వస్తున్నాయి. మొదటి దశ (డిసెంబర్ 11)లో 4,000కు పైగా గ్రామ పంచాయతీలు, 100 ఓఖుఅలు కవర్ అవుతాయి. రెండవ దశ (డిసెంబర్ 14)లో మరో 4,000 పంచాయతీలు, మూడవ దశ (డిసెంబర్ 17)లో మిగిలిన 4,769 పంచాయతీల ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది. మొత్తంగా 12,769 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికలకు 1.67 కోట్ల మంది ఓటర్లు అర్హులు, 1 లక్షకు పైగా అభ్యర్థులు పోటీ పడవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. తెలంగాణలో పంచాయతీ ఎన్నికలు 2020 అక్టోబర్‌లో జరగాల్సినప్పటికీ, రిజర్వేషన్ వివాదాలోత ఆలస్యమయ్యాయి. ఆర్టికల్ 243ఇ ప్రకారం ప్రతి 5 సంవత్సరాలకు ఎన్నికలు జరపాల్సినప్పటికీ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చి మాత్రమే ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం పట్టుదల చూపింది. అయితే హైకోర్టు జూన్ 2025లో "సెప్టెంబర్ 30 వరకు పూర్తి చేయాలి" అని ఆదేశించింది. అయితే, ఃఅ కమిషన్ నివేదికలు, 42% ఃఅ కోటా వివాదాలు, సెప్టెంబర్ 2025లో ప్రకటించిన పాత షెడ్యూల్ పై హైకోర్టు స్టే ఇచ్చింది. తాజా క్యాబినెట్ సమావేశంలో ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి "గ్రామ




పంచాయతీలు మాత్రమే డిసెంబర్‌లో జరుగుతాయి, కోర్టు తీర్పు తర్వాత" నిర్వహించాలని నిర్ణయించారు. పంచాయతీలకు రావాల్సిన మూడువేలకోట్ల నిధులు ఆగిపోకుండా పాత రిజర్వేషన్లతోనే ఎన్నికలు నిర్వహించాలని అనుకుంటున్నారు. ప్రజాపాలన వారోత్సవాలు తొమ్మిదో తేదీతో పూర్తవుతాయి. ఆ తర్వాత పంచాయతీ ఎన్నికల పోలింగ్ జరిగేలా షెడ్యూల్ ఖరారు చేయనున్నారు. మార్చిలోను పూర్తికాకపోతే 4 వేల కోట్ల నష్టం : తెలంగాణ ప్రభుత్వం రాజకీయ కారణాలతో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించకపో తూండటంతో ఆర్థిక సంఘం నిధులు ఆగిపోయాయి. ఇప్పటికే గ్రామాల్లో ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడుతున్నాయి. తెలంగాణలో పంచాయతీ ఎన్నికలు ఆలస్యం కావడం వల్ల రాష్ట్ర పంచాయతీ రాజ్ సంస్థలకు రూ.3,000 కోట్లకు పైగా కేంద్ర ఫైనాన్స్ కమిషన్ నిధులు 'ల్యాప్స్' అయ్యే ప్రమాదంలో పడ్డాయి. 2021-26 కాలానికి 15వ ఫైనాన్స్ కమిషన్ కేటాయించిన చేసిన రూ.7,201 కోట్లలో భాగంగా, 2024-25కి రూ.1,514 కోట్లు ఇప్పటికే 'ఫ్రీజ్' అయ్యాయని అధికారవర్గాలు చెబుతున్నాయి. ప్రజలు ఎన్నుకున్న పాలకవర్గాలు ఉన్న పంచాయతీలకే నిధులు జమ చేస్తారు. ప్రస్తుతం పంచాయతీల కాలపరిమితి ముగిసి ఏడాదిన్నర దాటిపోయింది. స్పెషలాఫీసర్ల పాలనలోనే ఉన్నాయి. నిధుల సమస్య ఉండటంతో గ్రామీణ అభివృద్ధి ప్రణాళికలు, శానిటేషన్, రోడ్లు, ఇతర పనులన్నీ పెండింగ్‌లో పడ్డాయి. బీసీ రిజర్వేషన్ల సుడిగుండంలో స్థానిక ఎన్నికలు చిక్కుకోవడంతో ఏం చేయాలో తెలియని పరిస్థితి ఏర్పడుతోంది. చివరికి పాత రిజర్వేషన్లతోనే డిసెంబర్ లో ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఏ కారణం చేతనైనా.. ఎన్నికలు నిర్వహించలేక పోతే..రూ. మూడు వేల కోట్లు ల్యాప్స్ అయిపోతాయి. ఫైనాన్స్ కమిషన్ నిధులు 'ఎలక్టెడ్ బాడీలు' ఉండాలని కండిషన్. దీంతో, రూ.1,000 కోట్లు ఫ్రీజ్ అయ్యాయి. ఫిబ్రవరి 2025లో మరో రూ.1,500 కోట్లు 'హోల్డ్' అయ్యాయి. ఆగస్టు 2025లో మరో రూ.3,000 కోట్లు 'రిస్క్'లో పడ్డాయి. పంచాయతీ సెక్రటరీలు తమ జేబులోంచి బ్లీచింగ్ పౌడర్ కొనుగోలు చేస్తూ, స్ట్రీట్ లైట్లు రిపేర్ చేస్తున్నారు. మునుపటి సర్పంచెస్‌లకు రూ.700 కోట్లు పెండింగ్ బిల్లులు, సెక్రటరీలకు రూ.383 కోట్లు ? మొత్తం రూ.1,083 కోట్లు పెండింగ్ ఉన్నాయి. రాష్ట్రంలో 12,769 పంచాయతీలు 'స్పెషల్ ఆఫీసర్ల' పాలనలో ఉన్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం 2018లో సుప్రీంకోర్టు ఆదేశాలతో 28 శాతానికే రిజర్వేషన్లు పరిమితం చేసి ఎన్నికలు నిర్వహించింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత, 42 శాతం బీసీ కోటా ప్రకటించింది. జీవోలు, ఆర్డినెన్స్ విడుదల చేశారు. కానీ అవేమీ న్యాయపరిశీలనలో నిలబడటం లేదుదు. మార్చి 2026కల్లా ఎన్నికలు జరిగకపోతే, 2025-26కి అలాట్ చేసిన రూ.3,000 కోట్లు ల్యాప్స్ అవుతాయని క్యాబినెట్ తాజాగా ఆందోళన వ్యక్తం చేసింది. పాత రిజర్వేషన్లతోనే పంచాయతీ ఎన్నికలు నిర్వహించి.. ఎంపీటీసీ, జెడ్‌పీటీసీలు, మున్సిపాలిటీలు 'పోస్టుపోన్' చేస్తామని చెబుతున్నారు. ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో గెలుపు ఊపులో ఎన్నికలు నిర్వహించి ఉంటే కాంగ్రెస్ పార్టీకి కూడా రాజకీయంగా లాభం కలిగి ఉండేది. కానీ బీసీ రిజర్వేషన్ల అంశం తేలిన తర్వాతే ఎన్నికలు నిర్వహిస్తామని పట్టుదలకు పోవడం వల్ల ఎన్నికలు ఆలస్యమవుతూ వస్తున్నాయి. గత ఏడాది నుంచి వచ్చే నెలే ఎన్నికలు అనే ప్రకటనలు కామన్ అయ్యాయి. డిసెంబర్ లో అయినా పూర్తి స్థాయిలో ఎన్నికలు నిర్వహించలేకపోతే.. పంచాయతీలు తీవ్ర ఆర్థిక కష్టాల్లో ఇరుక్కుపోతాయి. అంటే ప్రజలు ఇబ్బంది పడతారు.

# తెలంగాణ ప్రజల స్వప్నం సాకారం చేసిన తల్లి సోనియా గాంధీ

### - కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ నాయకులు నెమలి అనిల్ కుమార్





**మల్లాపూర్, డిసెంబర్ 09, (తెలంగాణ దిశ)** :స్వరాష్ట్ర ప్రదాత, స్వరాష్ట్ర కాంక్ష నెరవేర్చి,నాలుగు కోట్ల మంది తెలంగాణ ప్రజల స్వప్నం సాకారం చేసిన తల్లి శ్రీమతి సోనియా గాంధీ అని కాంగ్రెస్ గ్రేటర్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ అన్నారు. సోనియా గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకొని మంగళవారం మల్లాపూర్ డివిజన్ లోని ఎలిఫెంట్ సర్కిల్ వద్ద కాంగ్రెస్ పార్టీ మల్లాపూర్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన జన్మదిన వేడుకలలో నెమలి అనిల్ కుమార్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ





**మేడ్చల్‌జిల్లా ప్రతినిధి, నవంబర్ 09, (తెలంగాణ దిశ)** :ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలలో భాగంగా మంగళవారం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలోజిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, డిఆర్ఓ హరి ప్రియ, ఆర్డీఓలు వెంకట ఉపేందర్ రెడ్డి(కీసర), శ్యాంప్రకాష్ (మల్కాజిగిరి), జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ ఉమాగౌరీ, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు. తెలంగాణ సాంస్కృతిక కళాకారులు ప్రభుత్వ ప్రజా పాలన, సంక్షేమ పథకాలపై పాడిన పాటలు అందరిని ఎంతగానో అలరించాయి.

# స్మృతి మంధాన తండ్రి క్షేమం

### స్వల్ప అస్వస్థతతో ఆస్పత్రిలో చేరిపలాశ్
### డిశ్చార్జ్ అయినట్లు సన్నిహితుల వెల్లడి

న్యూఢిల్లీ : భారత మహిళా స్టార్ ప్లేయర్ స్మృతి మందాన వివాహం చివరి నిమిషంలో వాయిదా పడింది. మ్యూజిక్ డైరెక్టర్ పలాశ్ ముచ్చల్ తో స్మృతి వివాహం సాయంత్రం జరగాల్సి ఉండగా అనూహ్యంగా వాయిదాపడింది. ఉదయం ఆమె తండ్రి శ్రీనివాస్ మందాన గుండెపోటుకు గురయ్యారు. దీంతో పెళ్లి వాయిదా పడింది. ఈ షాక్ లో ఉన్న స్మృతికి మరో షాక్ తగిలింది. ఆమెకు కాబోయే భర్త పలాశ్ కూడా అనారోగ్యానికి గురయ్యారు. పలాశ్ ముచ్చల్ వైరల్ ఇన్ఫెక్షన్‌కు గురయ్యారు. దీనితో పాటు ఎసిడిటీ పెరిగినట్లు ఆయన స్నేహితులు తెలిపారు.
చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. చికిత్స తర్వాత పలాశ్ ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం స్మృతి మందాన తండ్రి శ్రీనివాస్ మందాన సాంగ్లీలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.
కొన్ని రోజుల కిందటే మందాన వివాహ వేడుకలు మొదలయ్యాయి. మెహందీ,హల్దీ, సంగీత్ కార్యక్రమాలు నిర్వహించారు. స్మృతి తండ్రి పూర్తిస్థాయిలో కోలుకునేదాకా ఆమె తన వివాహాన్ని వాయిదావేయాలని నిర్ణయించుకున్నట్టు ప్రకటించారు. చికిత్స అనంతరం అతడు ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయినట్లు జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి.

# టీడబ్ల్యూజెఎఫ్ ఆధ్వర్యంలో.. జనవరిలో జర్నలిస్టుల జనచైతన్య యాత్ర

- ఫెడరేషన్ ఏ వ్యక్తికి, ఏ పార్టీకి, ఏ పత్రికకు అనుబంధం కాదు...
- టీడబ్ల్యూజెఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు మామిడి సోమయ్య
- ఘనంగా టీడబ్ల్యూజెఎఫ్ మేడ్చల్ జిల్లా మహాసభ





**కుత్బుల్లాపూర్, డిసెంబర్ 09, (తెలంగాణ దిశ):** జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజెఎఫ్)వ్యవస్థాపక అధ్యక్షుడు, రాష్ట్ర కన్వీనింగ్ కమిటీ కన్వీనర్ మామిడి సోమయ్య డిమాండ్ చేశారు. జర్నలిస్టుల కనీస సమస్యలను ఈ నెలాఖరుగా పరిష్కరించకపోతే జనవరిలో రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టుల జనచైతన్య యాత్ర నిర్వహించి, వందలాది మందితో ఛలో హైదరాబాద్ కార్యక్రమం చేపడతామని ఆయన హెచ్చరించారు. మంగళవారం కుత్బుల్లాపూర్ సూరారంలోని అంబేద్కర్



భవన్ లో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మూడవ మహాసభ ఘనంగా జరిగింది. ఫెడరేషన్ రాష్ట్ర కో-కన్వీనర్ తన్నీరు శ్రీనివాస్ అధ్యక్షత జరిగిన ఈ మహాసభలో మామిడి సోమయ్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుల హక్కుల సాధనే ధ్యేయంగా ఏర్పడిన టీడబ్ల్యూజెఎఫ్ ఏ ఒక్క వ్యక్తికి సంబంధించినది కాదనీ, ఏ ఒక్క రాజకీయ పార్టీకి, పత్రికకు అనుబంధం కాదని స్పష్టం చేశారు. ఫెడరేషన్ లో జర్నలిస్టులందరికీ సమాన హక్కులు, బాధ్యతలున్నాయని చెప్పారు. ఈ మధ్య కొంత మంది స్వార్థపరులు సంఘాన్ని విచ్ఛిన్నం చేయడానికి కుట్రలు పన్నుతున్నారని, సంఘం మనుగడకే ప్రశ్నార్థకంగా మారుతున్నారని ఆయన ధ్వజమెత్తారు. అలాంటి వ్యక్తుల పట్ల జర్నలిస్టులు అప్రమత్తంగా ఉండాలని పిలుపు నిచ్చారు. ఉన్న సంఘాల్లో ఒక సంఘం బిఆర్ఎస్ ప్రభుత్వానికి వత్తాసు పలికి అభాసుపాలైందని, మరో సంఘం అధికార పక్షాన నిలబడి అభాసు పాలవుతుందని, జర్నలిస్టుల పట్ల వారి సమస్యల పట్ల చిత్తశుద్ధితో కూడిన నిబద్ధతతో పని చేసే ఏకైక సంఘం ఫెడరేషన్ అని అన్నారు. రాష్ట్రంలో నెంబర్ సంఘంగా ఎదుగుతున్న తరుణంలో కొందరు స్వార్థ పరులు సంఘాన్ని విచ్ఛిన్నం చేయడానికి కుట్ర పన్నారని, ఆ కుట్రలో భాగంగానే బసవపున్నయ్య అనే వ్యక్తి సంఘాన్ని అప్రతిష్ట పాలు చేస్తున్నాడని మామిడి సోమయ్య మండిపడ్డారు. జర్నలిస్టుల జీవితాలను తాకట్టు పెట్టే విధంగా ఆయన వ్యవహార శైలి ఉందని ఆరోపించారు. ఎదుగుతున్న సంఘాన్ని తన చేష్టలతో వెనుక్కి నెట్టి సంఘం పరువు తీశాడని అన్నారు. ఫెడరేషన్ ఎంతోమంది జర్నలిస్టుల త్యాగాల ఫలితంగా ఏర్పడిందని, ఈనాడు ఒక మంచి సంఘంగా గుర్తింపు పొంది జర్నలిస్టుల సమస్యల పట్ల పోరాటం చేస్తూ, జర్నలిస్టుల పక్షాన పోరాడే ఏకైక సంఘంగా గుర్తింపు తెచ్చుకుందని అన్నారు. ఐఎఫ్ డబ్ల్యూజే జాతీయ కార్యదర్శి పులిపలుపుల ఆనందం మాట్లాడుతూ కేంద్రం పెన్షన్ పథకాన్ని అమలు చేయాలన్నారు. రైల్వే రాయితీ పాసులను జర్నలిస్టులకు తిరిగి ఇవ్వాలని కోరారు. ఫెడరేషన్ కో- కన్వీనర్ వల్లాల జగన్ మాట్లాడుతూ జర్నలిస్టులకు రక్షణ చట్టం



తక్షణం అమలు చేయాలన్నారు. మరో కో- కన్వీనర్ ఆర్. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డులను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించి తక్షణ కార్యాచరణ ప్రకటించాలని నేషనల్ కౌన్సిల్ మెంబర్ రమాదేవి డిమాండ్ చేశారు. యువజన కాంగ్రెస్ జిల్లా నాయకులు బొంగునూరి కిషోర్ రెడ్డి మాట్లాడుతూ స్థానిక జర్నలిస్టుల సంక్షేమం కోసం సహాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ మహాసభలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జెమినీ నాగరాజు గౌడ్, జగదీశ్వర్ గుప్తా, కుత్బుల్లాపూర్ కార్యదర్శి గోవింద రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ శివ, మాజీ సర్పంచ్ కావలి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

**టీడబ్ల్యూజెఎఫ్ మేడ్చల్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక**

టీడబ్ల్యూజెఎఫ్ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మహాసభలో జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడుగా కట్టెల మల్లేశం, ఉపాధ్యక్షులుగా కావలి మోహన్, మనం శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శిగా గడ్డమీది అశోక్, సహాయ కార్యదర్శులుగా శంకర్, సంతోష్ రెడ్డి, పర్వేజ్ అహ్మద్, సంయుక్త కార్యదర్శులుగా రమేష్, చిన్నబాబు, కోశాధికారిగా అమరేందర్ గౌడ్, జిల్లా క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ గా బాల్ రాజ్ పటేల్, కార్యవర్గ సభ్యులుగా లింగారెడ్డి, సౌభాగ్య, రాజు, కొండల్ రెడ్డి, చైతన్య, రమేష్ తదితరులు ఎన్నికయ్యారు. నేషనల్ కౌన్సిల్ సభ్యులుగా ఎంపల్లి పద్మారెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా తన్నీరు శ్రీనివాస్, బెలిదె అశోక్, యావపురం రవి ఎన్నికయ్యారు.

# మిలినీయం సిటీగా గుర్గావ్



న్యూఢిల్లీ,: భారత్ లో మిలీనియం సిటీగా గుర్గాం మారుతోంది. కార్పొరేట్ క్యాపిటల్‌గా మారింది. సైబర్ సిటీ, ఉద్యోగ్ విహార్‌లో 500+ ఫార్చ్యూన్ 500 కంపెనీలు, ఎ ఫర్మ్‌లు, స్టార్టప్‌లు ఫ్లిప్‌కార్ట్, పేటీఎం వంటివి ఉన్నాయి. 2025లో ఉద్యోగాలు 20% పెరిగాయి. ఎకానమిక్ బూస్ట్. హౌసింగ్ బూస్ట్ ను పెంచింది. అందుకే గుర్గాం భారతదేశంలో బిలియనీర్లకు ప్రధాన హాట్‌స్పాట్‌గా మారింది. ఇక్కడి లగ్జరీ రియల్ ఎస్టేట్ బూమ్, ఎ-స్టార్టప్ హబ్ స్థితి, ఢిల్లీకి సమీపత వల్ల హై-నెట్‌వర్త్ ఇండివిజువల్స్, బిలియనీర్లు ఇక్కడే స్థిరపడుతున్నారు.గోల్ఫ్ కోర్స్ రోడ్, ఆఒఈ కామెలియాస్, సెక్టార్ 44, ఆఒఈ సైబర్ సిటీ వంటి ప్రాంతాలు 'ఉత్తర భారతదేశం బిలియనీర్ల రో'గా పేరుపొందాయి ? ముంబై అల్టామౌంట్ రోడ్ లేదా న్యూయార్క్ బిలియనీర్ల రోతో పోల్చుతున్నారు. ఉమా మ్యాపింగ్, రియల్-టైమ్ వాటర్ మానిటరింగ్ వంటి టెక్ ఇనిషియేటివ్‌లు సస్టైనబుల్ డెవలప్‌మెంట్‌ను ప్రోత్సహిస్తున్నాయి. ద్వార్కా ఎక్స్‌ప్రెస్‌వే పూర్తి, రాపిడ్ మెట్రో విస్తరణలు, ఢిల్లీ-జైపూర్ హైవేలు ట్రాఫిక్‌ను 30% తగ్గించాయి. సెక్టార్ 90 వంటి ఏరియాలు, సస్టైనబుల్ డిజైన్‌తో గ్రీన్ స్పేసెస్, సైక్లింగ్ ట్రాక్‌లు మారుతున్నాయి.గురుగ్రామ్, వేగవంతమైన అర్బనైజేషన్‌తో భవిష్యత్ రియల్ ఎస్టేట్ హబ్‌గా మారుతోంది. దానికి తగ్గ మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నారు. ఢిల్లీ నుంచి అతి దగ్గర కావడంతో.. ఎక్కడ మంది అక్కడ స్థరపడేందుకు ప్రాధాన్యమిస్తున్నారు. రాబోయే రోజుల్లో ముంబైతో పోటీ పడే అవకాశం ఉంది.

# కరాటేలో కంఫర్ట్ విద్యార్థుల ప్రతిభ




**కమాన్ పూర్,తెలంగాణ దిశ :** కమానపూర్ మండల కేంద్రానికి చెందిన కంఫర్ట్ గ్రామర్ పాఠశాల విద్యార్థులు పెద్దపల్లి జిల్లాలో నిర్వ హించిన రాష్ట్రస్థాయి కరాటే పాటిల్లో అద్వితీయ ప్రతిభకనబర్చారు. ఈ పోటీల్లో 16 మంది విద్యార్థులు పాల్గొనగ 16 మంది విద్యార్థులు మెడల్స్ సాధించారు. వీరిలో ఎం. సాద్విక (5వతరగతి) గోల్డ్మెడల్, ఎన్. శివమనిష్ (5వ),అదిబా తబస్సుమ్ (4వ) , బి.శివ మనీష్ (5వ), ఎస్. హర్షిత్ (6వ) సిల్వర్ మెడల్, ఎ.శివకుమారస్వామి) , కె. అనుదీప్ (6వ), ఇంకామహీన్ (5వ) , కె. రోహిత్ (6వ) , యు ఆశ్రిత్రుద్ర (3వ ) , జి. రితిక (శ్రీ (2వ) , బి అశ్విత్ (6వ) బ్రాంజ్ మెడల్, ఎ.శ్రీకాంత్ (5వ) , బి. నిత్యశ్రీ (5వ) , టి. అద్విత్ (5వ) , టి. శివన్షిత (3వ) పతకాలను సాధించిన వారికి ప్రముఖ కరాటే గ్రాండ్ మాస్టర్ కర్ర వెంకటేష్ మరియు టోర్నీ చైర్మెన్ బండారి సంతోష్ గార్లు అందజేశారు, విద్యార్థులు పతకాలు సాధించడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు అర్నకొండ వినయ్ కుమార్, సౌమ్య గార్లు అభినందనలు. తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మా అమ్మ క్షేమంగానే ఉన్నారు

**ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నాం: సిఎం రమేశం**

**హైదరాబాద్,తెలంగాణ దిశ :**తన తల్లి చింతకుంట రత్నమ్మ ఆరోగ్య పరిస్థితిపై దుష్ప్రచారం జరుగుతోందని.. ఈ వార్తలను ఎవరూ నమ్మవద్దని అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ తెలిపారు. హైటెక్ సిటీ యశోద ఆస్పత్రిలో ఆమె చికిత్స పొందుతున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు ఎంపీ రమేశ్ అధికారిక ప్రకటన విడుదల చేశారు. కొన్ని వార్త పత్రికల్లో, వాట్సాప్ గ్రూపుల్లో తన తల్లి స్వర్గస్తులు అయ్యారని అసత్య ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వార్తలు పూర్తిగా అవాస్తవం, నిరాధారమని వాపోయారు. దయచేసి ఎవరూ అలాంటి తప్పుడు సమాచారాన్ని నమ్మవద్దని, ప్రచారం చేయవద్దని విన్నవించారు. తన తల్లి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నప్పటికీ, ఆమెకు నిరంతరం వైద్యులు చికిత్స అందిస్తున్నారని చెప్పుకొచ్చారు. తమ కుటుంబం తరపున అందరూ చేస్తున్న ప్రార్థనలకు హృదయపూర్వక ధన్యవాదాలు అని అనకాపల్లి ఎంపీ రమేష్ పేర్కొన్నారు.

# కేంద్ర పాలిత ప్రాంతంగా చండీగఢ్!


-బిల్లుపై ప్రతిపక్షాల ఆగ్రహం
-తుది నిర్ణయం తీసుకోలేదన్న కేంద్ర హెూం శాఖ



న్యూఢిల్లీ : పంజాబ్, హర్యానా సంయుక్త రాజధాని చండీగఢ్‌లో చట్టాలు చేసే అధికారాన్ని రాష్ట్రపతి పరిధిలోకి తీసుకొచ్చే రాజ్యాంగ అధికరణ 131 సవరణ బిల్లు పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టనున్నట్లు కేంద్రప్రభుత్వం చేసిన ప్రకటనపై ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. కేంద్రంలో అధికారంలోకి వచ్చిననాటి నుంచి సమాఖ్య స్ఫూర్తిని నిర్వర్యం చేస్తూ వచ్చిన బిజెపి ప్రభుత్వం వివిధ రూపాల్లో రాష్ట్రాల హక్కులను, అధికారాలను గుంజేసుకొని తన గుప్పిట్లో పెట్టుకుంటోంది. అదే క్రమంలో జమ్ముకాశ్మీర్‌ను కేంద్ర పాలిత ప్రాంతాలుగా ముక్కలు చేసి..రాష్ట్ర హెూదా హామీ నెరవేర్చకుండా మీనమేషాలంటూ దాటవేస్తోంది. అదే తరహా కుటిల వ్యూహాన్ని ఇప్పుడు ప్రశాంతంగా ఉన్న పంజాబ్‌లోనూ అమల్జేసేందుకు మోడీ సర్కార్ పూనుకుంటోందని ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. సర్వత్రా ఆగ్రహావేశాలు పెల్లుబికిన నేపథ్యంలో.. ఆ ప్రతిపాదనపై తుది నిర్ణయం తీసుకోలేదని, పార్లమెంట్‌లో ప్రవేశపె ట్టడం లేదని కేంద్ర హెూం మంత్రిత్వశాఖ ప్రకటించింది. కేంద్ర పాలిత ప్రాంతాలకు వర్తించే ఆదేశాలు, చట్టాలను నేరుగా చేసే అధికారాలను రాష్ట్రపతికి కల్పించిన రాజ్యాంగ అధికరణం 240 పరిధిలోకి చండీగఢ్‌ను తీసుకురావాలని కేంద్రం ప్రతిపాదించిం ది. త్వరలో జరగనున్న శీతాకాల సమావేశాల్లోనే ఈ అంశంపై బిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్టనున్నట్లు శనివారం ప్రకటించింది. చట్టసభల్లేని కేంద్ర పాలిత ప్రాంతాలైన అండమాన్-నికోబార్ దీవులు, దాద్రా-నగర్ హవేలీ, దమణ్-దీవ్ ప్రస్తుతం అధికరణం 240 పరిధిలో ఉన్నాయి. ఈ అధికారణం పరిధిలోకి చండీగఢ్‌ను తీసుకువచ్చే బిల్లు ఆమోదం పొందితే రాష్ట్రపతికి చండీగఢ్‌లో చట్టాలు చేసే అధికారం ఉంటుంది. దీంతో ఆమ్ ఆద్మీపార్టీ, కాంగ్రెస్, అకాలీదళ్ ఈ బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం పంజాబ్ రాజధానిని లాక్కోవడానికి ప్రయత్నిస్తోం దని పంజాబ్ ముఖ్యమంత్రి, ఆప్ నాయకులు భగవంత్ మాన్ విమర్శి ంచారు. చండీగఢ్ గతంలోనూ, ప్రస్తుతం, భవిష్యత్తులోనూ పంజాబ్‌తో విడదీయరాని భాగమేనని పేర్కొన్నారు. ఆమ్‌ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ కూడా పంజాబ్ గుర్తింపుపై కేంద్రం దాడి చేస్తోందని విమర్శించారు. చండీగఢ్ పంజాబ్‌కు చెందినదేనని, దానిని లాక్కోవడానికి చేసే ప్రయత్నాలకు తీవ్ర ప్రతికూల పరిణామాలు ఉంటాయని పంజాబ్ కాంగ్రెస్ చీఫ్ అమరీందర్ సింగ్ పేర్కొన్నారు. అకాలీదళ్ నేత సుఖ్‌బీర్‌సింగ్ బాదల్ కూడా దీనిని పంజాబ్ వ్యతిరేక బిల్లుగా అభివర్ణించారు. మొదట ప్రకటించడం, ఆ తరువాత ఆలోచిస్తున్నామనడం కేంద్ర ప్రభుత్వానికి పరిపాటిగా మారిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఇన్‌ఛార్జి (కమ్యూనికేషన్స్) జైరామ్ రమేష్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో చండీగఢ్ పరిపాలనకు సంబంధించి ఎలాంటి బిల్లును ప్రవేశపెట్టే ఉద్దేశం కేంద్రానికి లేదని కేంద్ర హెూం మంత్రిత్వశాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. చండీగఢ్ కేంద్రపాలిత ప్రాంతానికి సంబంధించిన కేంద్రప్రభుత్వ చట్టం రూపొందించే ప్రక్రియను సరళీకరించాలన్న ప్రతిపాదన ఇంకా పరిశీలనలో ఉందని పేర్కొంది. 1966లో పంజాబ్ నుంచి హర్యానా విడిపోయిన తర్వాత చండీగఢ్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా ప్రకటించారు. పంజాబ్, హర్యానాకు అప్పటి నుంచి చండీగఢ్ ఉమ్మడి రాజధానిగా కొనసాగుతోంది. ప్రస్తుతం పంజాబ్ గవర్నర్ చండీగఢ్ అడ్మినిస్ట్రేటర్‌గా పాలన నిర్వహిస్తున్నారు. చండీగఢ్ పంజాబ్‌దేనని పలు రాజకీయ పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. హర్యానాకు ప్రత్యేక రాజధాని ఏర్పాటు చేయాలని కోరుతున్నాయి.

# ఇన్నర్ రింగ్ రోడ్డుకు నిధులు మంజూరు




**హైదరాబాద్,తెలంగాణ దిశ :** తెలంగాణ అభివృద్ధికి కీలకమైన రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) ఉత్తర భాగం పనులు వేగవంతం కానున్నాయి. కేంద్రం అనుమతితో ఉత్తర భాగం కోసం టెండర్లు పిలవనున్నారు. సంగారెడ్డి నుంచి రాయగిరి వరకు 161.5 కి.మీ. ఈ రహదారిని ముందుగా నాలుగు లేన్లు అనుకున్నారు. కానీ ఇప్పుడు 6 లేన్లుగా విస్తరించను న్నారు. దీని అంచనా వ్యయం రూ.15,627 కోట్లకు చేరింది. త్వరలోనే ఈ రహదారి నిర్మాణ పనులు ప్రారంభం అవుతాయంటు న్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో ప్రధాన పాత్ర పోషించనున్న రీజినల్ రింగ్ రోడ్డు(ఆర్ఆర్ఆర్) పనులకు సంబంధిం చి కీలకమైన అప్‌డేట్ వచ్చింది. ఆర్ఆర్ఆర్ పనులును ఉత్తర, దక్షిణ అంటూ రెండు భాగాలుగా విభజించిన సంగతి తెలిసిందే. వీటిల్లో ముందుగా ఉత్తర భాగం పనులు పూర్తి చేయాలని నిర్ణయించారు. ఈ క్రమంలో నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం పనుల్లో వేగం పెంచేందుకు నిర్ణయం తీసుకుంది. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం పనులకు కేంద్రం నుంచి అనుమతి రావడం తో.. టెండర్లను ఆహ్వానించేందుకు ఎన్‌హెచ్‌ఏఐ ఇంజినీర్లు రెడీ అవుతున్నా రు. డిసెంబర్, 2025లోఈ టెండర్లుపిలవనున్నారు. ఆర్ ఆర్ఆర్ ఉత్తరభాగం..సంగారెడ్డి జిల్లాలోని గిర్మాపూర్ గ్రామం నుంచి యాదాద్రి జిల్లాలో ఉన్న రాయగిరి వరకు ఉంది. అయితే తాజాగా తెలంగాణ ప్రభుత్వం ఆర్ఆర్ఆర్ రహదారి నిర్మాణాన్ని 4 లేన్ల నుంచి ఆరు లేన్లకు మారుస్తూ నిర్ణయం తీసుకోవడమే కాక ఆమోద ముద్ర కూడా వేసింది. దీంతో ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం అంచనా వ్యయం భారీగా పెరిగింది. దీనిప్రకారం..ఆర్ఆర్ఆర్ ఉత్తరభాగంలో నిర్మించ బోయే 161.5 కిలో మీటర్ల ఆరు లేన్ల రోడ్డు నిర్మాణం ఖర్చు ఇప్పుడు రూ.15,627 కోట్లకు చేరింది. డిసెంబర్‌లో టెండర్లు ఆహ్వా నించేందుకు అధికారులు రెడీ అవుతున్నారు. అయితే గతంలో ఈపీసీ పద్ధతిలో టెండర్లు పిలవగా.. ఇప్పుడు హ్యామ్ మోడల్‌లో పనులు చేయనున్నారు.ఆర్ఆర్ఆర్ మొత్తం పొడవు 343.5 కిలోమీటర్లు. దీని కోసం రూ.36 వేల కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. అలానే ఈ రహదారి నిర్మాణాన్ని 2 భాగాలుగా విభజించారు.ఉత్తర భాగం 161.5కిమీ కాగా దక్షిణభాగం 182కిలోమీటర్లుగా నిర్ణయిం చారు. ముందుగా ఉత్తర భాగం పనులు పూర్తి చేయాలని నిర్ణయించ డమే కాక.. డీపీఆర్ కూడా సిద్ధం చేశారు. అయితే ముందుగా 4 లేన్లతో ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం చేపట్టాలని భావించారు. ఇందుకు మొత్తం రూ.7,104.06 కోట్లు ఖర్చు అవుతుందని అంచనావేయ డమే కాక గతేడాది అనగా 2024 డిసెంబ ర్లోనే టెండర్లు పిలిచారు. అయితే నగరంలో పెరుగుతున్న వాహన రద్దీని దృష్టిలో ఉంచుకొని ఆర్ఆర్ఆర్ రోడ్డును ఆరు లేన్లుగా మార్చుతూ తెలంగాణ ప్రభుత్వం నిర్ణయంతీసుకుంది. దీంతో నిర్మాణ వ్యయం కూడా భారీగా పెరిగిం ది.పెరిగిన అంచనాలప్రకారం ఆర్ఆర్ ఆర్ ఉత్తర భాగం రోడ్డు నిర్మాణానికి రూ.15,627 ఖర్చు చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆమోదం తెలిపాయి.ఆర్ఆర్ఆర్ హ్యామ్ పద్ధతిలో నిర్మించడానికి అధికారులు సిద్ధమయ్యారు. మొత్తం ఆరు ప్యాకేజీల్లో రోడ్డు నిర్మాణ పనులుచేపట్ట నున్నారు. టెండర్ దక్కించుకు న్న సంస్థ రెండున్నర సంవత్సరాల కాలంలో పనులు పూర్తి చేయాలిన. అలానే 15 సంవత్సరాల పాటు రోడ్డు నిర్వహణ బాధ్యతలు చూసుకోవాలి.

# ఇక తెలంగాణలో ఒడిశా ఫార్ములా!

**హైదరాబాద్,తెలంగాణ దిశ :**బీహార్ ఎన్నికల ఫలితాల తర్వాత బీజేపీ దక్షిణాదిలో ఉన్న తెలంగాణ రాష్ట్రంపై ఫోకస్ పెంచనుంది. దక్షిణాది రాష్ట్రాల్లో బలహీనంగా ఉండటంతో బీజేపీ తెలంగాణను తమ విజయానికి గేట్ వే గా మార్చుకోవాలని పార్టీ కేంద్ర నాయకత్వం నిర్ణయించినట్లు సమాచారం. అందుకోసమే ఇకపై కేంద్ర మంత్రులు తరచూ తెలంగాణలో పర్యటిస్తూ పార్టీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేయాలని ఆదేశాలు జారీ చేసింది. రానున్న కాలంలో తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు కూడా మంజూరయ్యే అవకాశాలున్నాయని బీజేపీ సీనియర్ నేత ఒకరు చెప్పడం విశేషం. అంటే ఇక దక్షిణాదిలో కర్ణాటక తర్వాత తెలంగాణను తమ అడ్డాగా చేసుకోవాలని పార్టీ నాయకత్వం భావిస్తుంది. మరో మూడేళ్ల సమయం ఎన్నికలకు ఉండటంతో ఇక నాయకుల పర్యటనలతో తెలంగాణను హోరెత్తించనున్నారు. మొన్నటి పార్లమెంటు ఎన్నికల్లో గతంలో ఎన్నడూ లేని విధంగా ఎనిమిది స్థానాలు రావడంతో ఇక్కడ అధికారంలోకి రావడానికి ఎక్కువ అవకాశాలున్నాయని పార్టీ నాయకత్వం భావిస్తుంది. ఎప్పటి నుంచో తెలంగాణపై బీజేపీ నాయకత్వం నజర్ పెట్టినా మొన్నటి ఎన్నికల్లో కొంత సానుకూల వాతావరణం కనిపించింది. అసెంబ్లీ ఎన్నికల్లోనూ అత్యధిక అసెంబ్లీ స్థానాలను గతంలో ఎన్నడూ లేని విధంగా కైవసం చేసుకుంది. అయితే ఇక్కడ ఒడిశా ఫార్ములాను బీజేపీ ప్రయోగించే అవకాశాలు లేకపోలేదు. ఒడిశాలోనూ తొలుత అక్కడ కాంగ్రెస్ ను బలహీనపర్చింది. తర్వాత నవీన్ పట్నాయక్ నేతృత్వంలోని బిజూ జనతాదళ్ ను ఓడించి ఒడిశా రాష్ట్రాన్ని కైవసం చేసుకుంది. అయితే ఇక్కడ ఆ ఫార్ములా రివర్స్ లో చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే రెండుసార్లు అధికారాన్ని పొందిన ప్రాంతీయ పార్టీ బీఆర్ఎస్ ను తొలుత బలహీనం చేసిన తర్వాత ఇప్పుడు అధికారంలో ఉన్న జాతీయ పార్టీ కాంగ్రెస్ నుంచి అధికారాన్ని వేరు చేయాలన్న నిర్ణయానికి వచ్చింది. దేశంలో కర్ణాటక, తెలంగాణ వంటి పెద్ద రాష్ట్రాలే కాంగ్రెస్ చేతిలో ఉన్నాయి. వాటిని కూడా తమ చేతికి అందుకోవాలన్న ప్రయత్నంలో భాగంగా కర్ణాటకలో ఈసారి తమదే అధికారం అని నమ్ముతున్న బీజేపీ కేంద్ర నాయకత్వం, తెలంగాణలో మాత్రం పార్టీ నాయకత్వంతో పాటు క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడానికి అవసరమైన అన్ని రకాల వ్యూహాలను సిద్ధం చేస్తుంది. ఒంటరిగానే తెలంగాణలో ఒంటిచేత్తో అధికారంలోకి రావడానికి ప్రయత్నాలు ఇప్పటికే ప్రారంభించిందని పార్టీ వర్గాలు వెల్లడిస్తున్నాయి.

# వీరసానికి సరసంపు సమాధానం



శుకుడు పరీక్షిత్తుతో- రాజా! అంతట అయ్యిందు వదన రుక్మిణి ఇందీవర శ్యాముని- కృష్ణచంద్రుని ఎగ్గులు- అనాదరపు అమంగళ వాక్యాలు విని సిగ్గుపడి, మందహాసంతో కూడిన క్రీగంటి చూపులతో గోవిందుని అందమైన ముఖారవిందాన్ని సందర్శిస్తూ ఇలా పలికింది%‰% మురహరా! నీవు నిరవధిక- అనంత తేజోమూర్తివి. నీవన్నమాట ఉన్నమాటే! సృష్టికే ఏకైక ఏలికవైన స్వామీ! ఏ దృష్టితో పరికించినా నీకు నాకు పోలిక లేనే లేదు. ఆపన్న శరణ్యా! వెలకట్టలేని జ్ఞాన, ఐశ్వర్య, సుఖ, బలాది సద్గుణాలన్నీ నీలోనే నెలకొని ఉన్నాయి. నీవు నలువ- బ్రహ్మాదులకు కూడా ఈశ్వరుడవు- పరబ్రహ్మవు. అగుణుడవు- గుణాతీతుడవు. సకల కళలకు ఆదిగురుడవు. జగద్గురుడవైన నీవెక్కడ? త్రిగుణ స్వభావ నగు ప్రకృతినైన నేనెక్కడ. విజ్ఞులు- వివేకవంతులు, భక్తులు%‰% నీవే గతివని, నీ కొరకే, నీ యందే రతి- ప్రేమాభక్తి కోరి, నీ పదపద్మాలు వెతికి పట్టుకుంటారు.

'సతాం గతిః'-

సత్పురుషులకు గతియైన వాడా! ఇక నా సంగతి? సకాములైన అజ్ఞులు సిరి సంపదలు కోరి నా పాద వారిజా (కమలా)లను ఆశ్రయిస్తారు. రూక్ష్మైన సామ్యబుద్ధిగల అనంత జీవకోటికి ఆరాధ్య- పూజనీయురాలనైన నేను, అకాముడవై, మోక్ష కాంక్షులచే ఆకాంక్షింపబడే నీకెలా సాటి రాగలను?

భద్ర పురుషా! క్షుద్ర రాజులకు భయపడి సముద్రాన్ని ఆశ్రయించానని అన్నావు కదా! అదేంటి స్వామీ? 'యద్బిభేతి స్వయం భయం'- నువ్వంటే భయానికే భయమే! నీ స్వరూపమే 'అభయం' కదా! ఈ మీ భయం మాయా విడంబనం- నటన మాత్రమే..

సీ॥ 'కోరి నీ మంగళ గుణభూతి దానంబు
సేయంగబడు నని చెందు భీతి'

తే॥ 'నంబునిధి మధ్య భాగమందమృత ఫేన
పటల పాండురనిభమూర్తి! పన్నగేంద్ర
భోగశయ్యను బవ్వళింపుచును దనరు
నట్టి యున్నత లీల దివ్యంబు దలప'

మహాత్మా! మీ సద్గుణ భూతి- సంపద (అగుణులకు, అపాత్రులకు) దానం చేయబడుతుందనే భీతి- భయంతోనో లేక శంకతోనో కాబోలు, ఓ నిష్కలంకా! నువ్వు ఎవ్వరికీ అందకుండా పాల సంద్రంలో పులుగురేడు- పన్నగేంద్రు (గరుడు)ని శయ్యపై పవ్వళించి ఉన్నావు గదయ్యా! అపవర్గ- మోక్షస్వరూపా! ఇక దుర్గాశ్రయణం- ద్వారకలో కోటను ఆశ్రయించడమంటావా? (శబ్దస్పర్శరూప రసగంధ)- విషయాలనే రాజులకు వెరచినట్లుగ, వారధి (సాగరం) వంటి విషయాకార రహితమై, అగాధమైన హృదయమనే అంతస్సముద్రంలో గుణస్పర్శ లేకుండా అసంగివై చైతన్య ఘనుడవై అద్వితీయంగా నిశ్చలంగా ప్రకాశిస్తూ ఉంటావు. దివ్య తేజోమయా! రజో (గుణ) మూర్తులైన రాజులకు నిన్ను చేజిక్కించుకోవడం- భజించడం సాధ్యమవుతుందా? ఇక, బలవంతులతోడి పగ- విరోధమంటావా? నగధరా! బహిర్ముఖాలై బలవంతాలైన ఇంద్రియాలు కలిగిన వారికి, ఇంద్రియ వశులకు, ఓ అంతర్యామీ! నీవు గోచరించవు. అందుకే వారు నిన్ను ద్వేషిస్తూ నిందిస్తారు. ఇందులో వింత ఏముంది? పోతే, రాజ సింహాసన అర్హత- శాసన యోగ్యత లేదన్నావు. అదీ సమంజసమే!

కం॥ 'శ్రీ పతియు యజ్ఞ పతియు బ్ర
జాపతియున్ బుద్ధిపతియు జగదధిపతియున్
భూపతియు యాదవ శ్రే
ణీ పతియున్ గతియునైన నిపుణు భజింతున్'

(ద్వితీయ స్కంధం, పోతన).. 'శ్రీదేవికి, భూదేవికి, యజ్ఞానికి, ప్రజలకు, ప్రజ్ఞ- బుద్ధికి, యాదవ వర్గానికి, వెయ్యేల సర్వ జగత్తుకీ పతి, గతి అయిన భగవంతుని సేవిస్తా'. 'పతిం విశ్వస్య ఆత్మేశ్వరం..' ఈ విశ్వానికే మీరు అధిపతులైతే, వాసుదేవా! మీకు ఈ లోకంలోని క్షుద్ర, పరిచ్ఛిన్న- పరిమిత రాజ్య సింహాసనాలు ఉంటే ఏమి? లేకుంటే ఏమి? పూర్వం మీ కోసం ఎందరు ధాత్రీశులు- రాజులు తమ రాజ్యాలు త్యజించి అడవులను ఆశ్రయించి తపస్సుతో తరించలేదు? అయినా, భక్తుల హృదయాలే మీకు అనురక్తి కలిగిన సింహాసనాలు! ప్రోడా (చతురా)! మా జాడలు ఎవరికీ తెలియవన్నారు- 'గూఢో గభీరో గహనో గుప్తః చక్రగదా ధరః' (విష్ణు సహస్ర నామాలు). బృందారక వంద్యా! అది కూడా యుక్తమే! మీ దివ్య పాదారవింద చింతనామృత పాన విశేష మత్త చిత్తులైన, మీ కొరకు నిత్తెమూ- నిరంతరం అన్వేషించు మునిసత్తములంత వారికే మీ మార్గం గూఢం- అగోచరం, అంతుపట్టనిది. కాగా, ఆపాద మస్తకం అజ్ఞానం నిండిన ద్విపాద పశువుల సంగతి చెప్పేదేముంది? మా భావం ఎఱుక పడదన్నారు. భూత భావనా! మీ భాగవతుల- భక్తుల ఊహాలే అలౌకికాలు- అగమ్యగోచరాలు అయి ఉండగా, ఓ భగవంతా! మీ ఊహలు- సంకల్పాలు మా వంటి మోహావిష్టులకు, ఆహా! కేవలం అపోహలే- భ్రమలే కావా? తప్పుటూహలే అవుతాయి కదా!

ఘనాఘన సుందరా! 'మేము అకించనులం, అకించన ప్రియులం. అందుకే గుణాఢ్యులు- సద్గుణాలలో అధికులు తప్ప ధనాఢ్యులు మమ్ము గణించరు- లెక్కపెట్టరు' అన్నారు. 'మత్తః పరతరం నాన్యత్కించి దస్తి'- (గీత)- మీకన్నా అన్యం- ఇతరంగా కించిత్తు కూడా లేదు కాన, మీరు నిజంగా అకించనులే- ఏమీ లేనివారే! పరమార్థంలో.. మీరు శ్రీపతులు, శ్రీనిధులు, శ్రీధరులు, శ్రీకరులు. బ్రహ్మాది దేవతలు లోకులచే బలులు గ్రహించి అవి మీకు సమర్పించుకుంటారు. కాన, మీ కన్నా 'శ్రీమతాం వరః' సృష్టిలో శ్రీమంతులలో శ్రేష్ఠుడు వేరొకడున్నాడా? అనాథ నాథా! దీనులు, అనాథలు- నిరుపేదలు నావారని అన్నారు. దయాసింధో! నిజమే, దిక్కులేని వారికి మీరు కదా ఆత్మ బంధువులు. కలిమి, బలిమి కలవారు మాతో చెలిమి చెయ్యరన్నారు. ఇదీ అక్షర సత్యమే. ధన బల మదాంధులకు ఇంద్రియ తృప్తే, ఏకైక లక్ష్యం. శక్తిమంతులమని విర్రవీగు అహంకారులు మిమ్ము ఆశ్రయించరు. జగత్తే సత్యమను చిత్తం కలవారు మిమ్ములను అర్చించరు. 'ఇందువదనా! నన్నే ఎందుకు పొందాలని అనుకున్నావు' అని అడిగారు. ఓ దేవాధిదేవా! నీ కనుబొమలు ముడిపడినంత మాత్రాన, సిరులు- వైభవాలు మసిబారి- పస చెడి, నల్దెసలు చెదిరి, బెదరిపోయే సురజ్యేష్ఠుడు- బ్రహ్మదేవుడు, పరమేశ్వరుడు, అమరేంద్రుడు మొదలైన దేవతలందరినీ నా డెందం- హృదయం తిరస్కరించింది. అలాంటిది, 'శిశుపాల జరాసంధ, దంతవక్త్ర, పౌండ్రకాది అధికార రోగ పూరిత బధిరాంధక' శవాల గురించి చెప్పనేల?

కరి వరదా! నా మనసు మిమ్ము వరించింది. మీ ధనుసు టంకారంతోనే సకల అరి- శత్రు రాజులను జయించి, కేసరి- సింహం మృగాలను పారద్రోలి తన భాగాన్ని- వంతును సొంతం చేసుకున్నట్లు, తిరుగులేని పరాక్రమంతో, ఓ ఉరుక్రమా! మీరు నన్ను పరిగ్రహించారు. తమ అవ్యాజ- అకారణ కరుణ, నా అదృష్టం! వాసుదేవా! నన్ను తమ దాసీగా అంగీకరించారు. కంసారీ! సాంసారిక జీవులందరూ కాలాధీనులు, మృత్యుగ్రస్తులు. వారితో వివాహ బంధమేమిటి? అశరణ శరణా! మీ చరణ దాసీత్వం స్వీకరిస్తా. అంతేకాక, కరుణావరుణాలయా! మీ చరణారవింద మకరందాన్ని ఆనందంగా ఆస్వాదించే నేర్పుగల తేటి- తుమ్మెద వంటి తేటి కంటి (నల్లని కనురెప్పలు గల సుందరి), చర్మంతో కప్పబడిన, రక్తమాంస మల మూత్రాది దుర్గంధ పదార్థాల మూట లాంటి, కాటి పాలయ్యే జీవచ్ఛవం- అశివమైన నరాధముణ్ని- నడపీనుగుని ఏ వధూటి- భామిని అయినా ఏటికి కామిస్తుంది? పురుషోత్తమా! మీరు ఆత్మారాములు, పూర్ణకాములు- నిష్కాములు కనుకనే ఉదాసీనులు, అనాసక్తులు. భువన సుందరా! నా సౌందర్యం, గుణాల పట్ల మీ దృష్టిపోదు. ఆపన్న ప్రసన్నా! 'నన్ను అనుసరించు వారు విపన్నులు- ఆపదల పాలవుతార'ని అన్నారు కదా! ప్రాచీనులైన పృథు, భరత, యయాతి, ప్రియవ్రత, గయాదులు మీకై భోజ్యా- భోగయోగ్యాలైన లౌకిక రాజ్యాలను త్యజించి, అరణ్యాలకు వెళ్లి తపస్సు గావించి, ఓ అమరపూజ్యా! సాయుజ్యం- మోక్షం పొందారే కానీ, వారు ఏ పాట్లూ పడలేదే! రమాపతీ! మరో ధరాపతి- రాజును పతిగా పొందమని అన్నావు..

సీ॥ 'నీరదాగమ మేఘ నిర్ముక్తపయః పాన
చాతకంబేగునే చౌటి పడెకు?
బరిపక్వ మాకంద ఫలరసంబులు గ్రోలు
కీరంబు సనునె దుత్తూరములకు?
ఘనరవా కర్ణనోత్కలిక మయూరము,
గోరునే కఠిన ఝిల్లీరవంబు
గరికుంభ పిశిత సద్గ్రాస మోదిత సింహ
మరుగునే శునక మాంసాభిలాష'

తే? 'బ్రవిమలాకార! భవదీయ పాదపద్మ
యుగ సమాశ్రయ నైపుణోద్యోగచిత్త
మన్య జేరునె తన కుపాస్యంబు గాగ?
భక్త మందార! దుర్భర భవవిదూర!'

'భక్త మందార (భక్తులకు కల్పవృక్షం వంటివాడా)! దుర్భర భవ విదూరా (భరింపరాని సంసార బంధాలను భగ్నమొనర్చు- తెగటార్చువాడా)! స్వాతి కార్తిలో కజ్జల- మేఘ జల బిందువులను నేల మీద పడకుండానే పానము చేసే- తాగే చాతక పక్షి- వాన కోయిల చౌటి (ఉప్పునీటి) గుంటలోని నీటి కోసం వెళుతుందా? బాగా పండిన చూత- మామిడి రసాన్ని గ్రోలే కీరం- చిలుక దుత్తూరాన్ని- ఉమ్మెత్తని చిత్తగిస్తుందా- ఇష్టపడుతుందా? నీల నీరన- కారుమబ్బుల గర్జన ధ్వని విని ఆనందించే కాలకంఠం- నెమలి ఈల పురుగు (కీచురాయి) ధ్వనులను ఏల కోరి ఆలకిస్తుంది? మదకరి- మదించిన ఏనుగు కుంభస్థలంలోని మాంసాన్ని తిని తనివి- తృప్తిపడే కేసరి (సింహం) కుక్క మాంసం కోసం కక్కుర్తి పడుతుందా? శుభాకారా! నీ చరణ కమలాలను ఆశ్రయించి ఆనందించే చిత్తం అన్యాయత్తం- అన్యమైన దానికి అధీనమవుతుం దా? ఇతరాన్ని సుతరాం- బొత్తుగా (ఎంతమాత్రం) కోరదు గదా!' మనసుకు ఇంపు- ఆనందం గొలిపే వినసొంపైన పై సీస పద్యం భక్త కవీశుడు పోతన పోత పోసి భావుక భక్తులకు తోరంపు- అందమైన ఆరగింపు (నైవేద్యం)గా అందించిన మరో 'మందార మకరంద మాధుర్య' విందు! రస స్వరూపుడైన శ్రీకృష్ణుని ఈ 'విరసం' తరువాత వైదర్భి- రుక్మిణిలో వినయ విధేయతలు ఎంతగానో వికసించి విప్పారినాయి. భైష్మి మానినిగా ఉన్నప్పుడు మాధవుడు 'దేవీ! నేను నీకు అయోగ్యుడను' అన్నాడు. తన అభిమానం తొలగగా రుక్మిణి అంటున్నది- 'మహానుభావా! నేను మీకు తగిన దానను కాదు. నేను పట్టమహిషి- రాణిని కాదు, ఒట్టి చేటిని- పనికత్తెని'. ఈ నమ్రత వచ్చిన తరువాతనే వాసుదేవుడు రుక్మిణిని సమ్మానించి, సంభావించాడు.

# నిరుపేదలకు సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యం

**ఇందిరమ్మ ఇళ్ల పథకం పేదలకు వరం**

**తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



**ధర్మపురి,తెలంగాణ దిశ :** నిరుపేదలకు సొంతింటి కలను సహకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, పేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం గొప్ప వరమని తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలోని ఆవుల సాయవ్వకు మంజూరైన ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తి కాగా, సోమవారం మంత్రి లక్ష్మణ్ కుమార్, జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ తో కలసి ఇందిరమ్మ ఇల్లును ప్రారంభించి, గృహప్రవేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ గృహప్రవేశ కార్యక్రమంలో రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జిల్లా కలెక్టర్ సత్యప్రసా ద్ ముఖ్య అతిథులుగా పాల్గొని కుటుంబానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వం సంకల్పించిన ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కల సాకారం లక్ష్యంగా ఇందిరమ్మ పథకం వేగంగా అమలవుతోందని పేర్కొన్నారు. అర్హులైన నిరుపేదలందరికీ ఇళ్లను మంజూరు చేయడంలో ప్రభుత్వం కట్టుదిట్టంగా పనిచేస్తోందని చెప్పారు. ఇప్పటికే ప్రొసీడింగ్స్ పొందిన లబ్ధిదారులు నిర్మాణంలో ఉన్న పనులను వేగంగా పూర్తి చేసి బిల్లులను పొందాలని సూచించారు. గ్రామాల్లో ప్రొసీడింగ్స్ పొందిన లబ్ధిదారులు నిర్మాణం ప్రారంభించని పక్షంలో, ఇతర అర్హులైన వారిని ఎంపిక చేసుకునే పరిస్థితి వస్తుందని మంత్రి హెచ్చరించారు. గొల్లపల్లి మండల కేంద్రానికి చెందిన ఆవుల సాయవ్వ కుటుంబం గృహప్రవేశం చేసుకోవడం ఆనందదాయకమని పేర్కొంటూ, వారిని ఆదర్శంగా తీసుకొని మిగతా లబ్ధిదారులు కూడా తమ ఇళ్ల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసుకోవాలని కోరారు. అనంతరం ఆవుల సాయవ్వ నూతన గృహంలో జిల్లా కలెక్టర్ తో కలిసి మంత్రి అడ్లూరి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ మాజీద్, ఎంపిడిఓ రవీందర్ రావు, ఏఎంసీ చైర్మన్ భీమ సంతోష్, కాంగ్రెస్ పార్టీ గొల్లపల్లి మండల అధ్యక్షులు ముస్కు నిశాంత్ రెడ్డి, టౌన్ అధ్యక్షులు నేరెళ్ల మహేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తిరుపతి గౌడ్, సత్తయ్య, ప్రవీణ్, అధికారులు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# ఎట్టకేలకు రోడ్డుకు మోక్షం



**హైదరాబాద్,తెలంగాణ దిశ :** తాండూరు నుంచి హైదరాబాద్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న గుంతల సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. రహదారులు, భవనాల శాఖ అధికారులు ఈ రోడ్డు మరమ్మతులు, పునర్నిర్మాణ పనులను ప్రారంభించారు. మొత్తం 40 కిలోమీటర్ల పొడవునా పనుల కోసం రూ.48.80 కోట్లు కేటాయించారు. పట్టణ ంలోని రెండు కిలోమీటర్ల మేర వరద నిలిచే ప్రాంతంలో సిమెంటు రోడ్డును (రూ.5 కోట్లు) నిర్మిస్తున్నారు. మిగిలిన మార్గానికి రూ.43.80 కోట్లతో ప్యాచ్ వర్కులు, పూర్తిస్థాయి తారు రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. ఈ పనులన్నీ రెండు నెలల్లో పూర్తి చేస్తామని తాండూరు ఇన్‌ఛార్జి డీఈఈ శ్రవణ్ కుమార్ తెలిపారు.వికారాబాద్ జిల్లాలోని తాండూరు పట్టణం నుంచి రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న గుంతలు, గోతులతో వాహనదారులు పడుతున్న కష్టాలకు ఎట్టకేలకు ఉపశమనం లభించింది. రహదారులు, భవనాల శాఖ (ర.భ.శాఖ) అధికారులు ఈ కీలకమైన మార్గానికి మరమ్మతులు, పునర్నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన ప్రారంభించారు. ముఖ్యంగా.. తాండూరు పట్టణ పరిధిలోని మొదటి రెండు కిలోమీటర్ల మేర రోడ్డు పూర్తిగా పాడైపోయి, తారు లేచిపోయి.. కేవలం కంకర మాత్రమే మిగిలి ఉండేది. ఈ ప్రాంతంలో గత మూడేళ్లుగా వర్షాకాలంలో ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు రోడ్డుపైకి చేరడంతో.. రోడ్డు పూర్తిగా గోతులమయంగా మారిపోయింది.దీంతో వందల కొద్దీ వాహనదారులు, వ్యాపారులు, ఉద్యోగులు మరియు విద్యార్థులు ప్రయాణించే ఈ మార్గంలో రాకపోకలు నరకప్రాయంగా మారాయి. అర గంటలో వెళ్లాల్సిన ప్రదేశానికి గంట సమయం పట్టేదని వాహనదారులు వాపోతున్నారు. ఈ తీవ్ర సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ర.భ.శాఖ అధికారులు ఒక ప్రణాళికను రూపొందించారు. తాండూరు ప్రారంభంలో.. వరద నీరు నిలిచే అవకాశం ఉన్న రెండు కిలోమీటర్ల మార్గాన్ని అత్యంత పటిష్టమైన సిమెంటు కాంక్రీటు రోడ్డుగా (సీసీ రోడ్డు) మార్చుతున్నారుఈ పనులకు అంచనా వ్యయం రూ.5 కోట్లుగా నిర్ధారించారు. ఇక పట్టణాన్ని దాటిన తర్వాత హైదరాబాద్ వైపు మిగిలిన 38 కిలోమీటర్ల ప్రధాన రహదారిపై ఏర్పడిన గోతులు, గుంతలను పూడ్చేందుకు.. అలాగే పూర్తిస్థాయిలో తారు రోడ్డును పునర్నిర్మించేందుకు రూ.43.80 కోట్లు కేటాయించారు. ఈ నిధులు మొత్తం రహదారి నాణ్యతను మెరుగుపరచడానికి ఉపయోగపడతాయి. మొత్తంగా ఈ 40 కిలోమీటర్ల రోడ్డు విస్తరణ, పునరుద్ధరణ కోసం ప్రభుత్వం దాదాపు రూ.48.80 కోట్లు ఖర్చు చేయనుంది. దీంతో హైదరాబాద్ వెళ్లే వారికి ప్రయాణ సమయం భారీగా తగ్గే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.ఈ పనుల పురోగతిపై తాండూరు ఇన్‌ఛార్జి డీఈఈ శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ.. రోడ్డు మరమ్మతులను వేగవంతం చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం చేపట్టిన సిమెంటు రోడ్డు నిర్మాణం పూర్తైన వెంటనే.. హైదరాబాద్ రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చే ప్యాచ్ వర్కులను 20 రోజుల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ముఖ్యంగా.. తక్షణమే రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేయడమే తమ మొదటి ప్రాధాన్యత అని అన్నారు.ఆ తర్వాత.. రహదారిని పూర్తిస్థాయిలో, నాణ్యతా ప్రమాణాలతో మెరుగుపరచడానికి రెండు నెలల సమయం పడుతుందని డీఈఈ వివరించారు. ఈ మొత్తం పునర్నిర్మాణం పూర్తయితే.. తాండూరు నుంచి హైదరాబాద్‌కు ప్రయాణ సమయం గణనీయంగా తగ్గుతుంది. ఈ రోడ్డు అభివృద్ధి తాండూరు వాసులకు రాజధానితో మెరుగైన అనుసంధానాన్ని కల్పించి.. స్థానిక వ్యాపారాలకు, రవాణాకు మరింత ఊతం ఇస్తుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు కోసం సమిష్టిగా కృషి చేయాలి

## మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

**జగిత్యాల,తెలంగాణ దిశ :** స్థానిక సంస్థల ఎన్నికల్లో సమిష్టిగా కృషి చేయాలని బీఆర్ఎస్ పార్టీ నేత, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ కార్యకర్తలకు సూచించారు జగిత్యాల జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో స్థానిక సంస్థల ఎన్నికల గురించి ధర్మపురి నియోజకవర్గ పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ.... రాబోయే స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయానికి నాయకులంతా కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రామాల వారీగా పార్టీ పరిస్థితి, అభ్యర్థుల విజయానికి తీసుకోవాల్సిన చర్యల గూర్చి చర్చించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు ఘన విజయం సాధించాలంటే నాయకులంతా ఐక్యంగా పని చేయాలని కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు పార్టీలో సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకరావాలని ఈ సందర్భంగా కోరారు.బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించే బాధ్యత ప్రతి నాయకుడిపైనా ఉందని, ప్రతి గ్రామంలో నాయకులు తదుపరి కార్యాచరణపై సిద్ధంగా ఉండాలని సూచించారు. గ్రామ పంచాయతీల ఓటర్ల తుది జాబితా విడుదల సమయంలో పొరపాటుగా తొలగించిన ఓట్లను గుర్తించి అధికారులకు తెలిపేలా పార్టీ నాయకులు పనిచేయాలని సూచించారు. బీఆర్ఎస్‌పై ప్రగాఢమైన నమ్మకం ఉందని, నాయకులు ఇప్పటి నుండే ప్రజల్లోకి వెళ్ళి మమేకత పెంచుకోవాలని తెలిపారు..అందుకు పార్టీ నాయకులంతా ఎలాంటి తారతమ్య భేదాలు లేకుండా కలిసికట్టుగా నడవాలని కొప్పుల సూచించారు.

బీఆర్ఎస్ పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమం గురించి ప్రజలకు గడపగడపకు వివరించాలని ఆయన సూచించారు. విభిన్న అంశాలపై దృష్టి పెట్టి కేంద్రంలోని అధికార బిజెపి ప్రభుత్వం, రాష్ట్రంలోని అధికార కాంగ్రెస్ ప్రభుత్వం కొన్ని హామీలను అమలు చేయడంలో విఫలమైన విషయాన్ని ప్రజలకు వివరించాలని సూచనలిచ్చారు బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం పథకాలు వంటి అంశాలను ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలి

**కరీంనగర్,తెలంగాణ దిశ :** అర్జీలు పరిష్కరించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లక్ష్మీకిరణ్ అధికారులకు సూచించారు.

కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రజావాణి నిర్వహిం చారు. ఈ సందర్భంగా కరీంనగర్ నగరపాలక కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ఆర్డీవో మహేశ్వర్ ఇతర ఉన్నతాధికారులతో కలిసి దరఖాస్తులు స్వీకరించారు. కొన్ని దరఖాస్తులను అక్కడికక్కడే పరిష్కరించారు. మొత్తం 352 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో అత్యధికంగా కరీంనగర్ నగరపాలికకు 67 హౌసింగ్ శాఖకు సంబంధించి 74 దరఖాస్తులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



# అద్దె డబ్బులు చెల్లించలేదని గిరిజన కళాశాల భవనానికి తాళం వేసిన యజమాని..?




**మంథని,తెలంగాణ దిశ :** మంథని పట్టణంలోని గిరిజన గురుకుల బాలికల కళాశాల భవనానికి 8 మాసాలుగా అద్దె డబ్బులు ఇవ్వటం లేదని యజమాని కళాశాల కార్యాలయానికి తాళం వేశాడు. సమాచారం అందుకున్న సిపిఎం పార్టీ నాయకులు కళాశాలను సందర్శించి రెవెన్యూ సిబ్బందితో కళాశాల సిబ్బంది మరియు యజమానితో చర్చలు జరిపారు.ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బూడిద గణేష్ మాట్లాడుతూ మంథనిలో విద్యావ్యవస్థ రాను రాను నిర్వీర్యం అవుతుందని అన్నారు. దళితులు గిరిజనులు బడుగు బలహీన వర్గాల హాస్టల్ విద్యార్థుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని అన్నారు. ఏడు సంవత్సరాలుగా గిరిజన కళాశాల అద్దె భవనంలో కొనసాగుతుందని ఇంకా ఎన్ని సంవత్సరాలు గిరిజన విద్యార్థులు అద్దె భవనాలలో ఉండాలని ప్రశ్నించారు. ఎనిమిది మాసాలుగా అద్దె డబ్బులు యజమానికి ఎందుకు ఇవ్వటం లేదని ప్రశ్నించారు విద్యార్థులు సంవత్సర పరీక్షలకు సిద్ధమవుతున్న సమయంలో కళాశాల భవనానికి తాళాలు వేసి విద్యార్థులను ఇబ్బందులకు గురి చేయడం సరికాదని అన్నారు. విద్యార్థినులు రోడ్డుమీదికి వస్తే ప్రభుత్వ అధికారులే బాధ్యత వహించాలని హెచ్చరించారు. అద్దె డబ్బులు చెల్లింపు విషయంలో ఆర్ సి ఓ చేతివాటం ప్రదర్శిస్తున్నాడని అనుకున్న పర్సంటేజ్ ప్రకారం మామూలు ఇవ్వకుంటే అద్దె డబ్బులు చెల్లించడం లేదని ఆర్ సి ఓ పనితీరు మార్చుకోవాలని డిమాండ్ చేశారు. మంత్రి శ్రీధర్ బాబు స్పందించి ప్రభుత్వం నుండి రావలసిన అద్దె డబ్బులు విడుదల చేయాలని గిరిజన బాలికల కళాశాల భవనంతో పాటు ఇతర హాస్టళ్లకు పక్క భవనాలు మంజూరు చేయించాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట ఆయన వెంట సిపిఎం నాయకులు మంథని లింగయ్య, బాబు రవి ఉన్నారు.



# 'మీరు మారుతున్నట్లు' గ్రహించాలి!

మహిళల్లో వయసుతో పాటు వచ్చే ఎన్నో మార్పుల్లో మెనోపాజ్ ఒకటి. ఈ మెనోపాజ్‌కి ముందు మహిళలు శారీరకంగా, మానసికం గా ఎంతో కుంగిపోతుంటారు. తల నుండి పాదం వరకు రకరకాల అనారోగ్య సమస్యలు వారిని చుట్టుముడతాయి. మానసిక ఆరోగ్యం కూడా దెబ్బతింటుంది. ఒకటి, రెండు కాదు.. కొన్నేళ్లపాటు ఈ సమస్యలు పట్టిపీడిస్తాయి. అయితే వీటిని బహిరంగంగా చర్చించేం దు కు చాలామంది ఇష్టపడరు. హార్మోనుల అసమతుల్యత వల్ల జరిగేఈమార్పుల గురించి మహిళలకి అవగాహన కల్పించే ప్రముఖ చర్మవ్యాధి నిపుణురాలు, డాక్టర్ జయశ్రీ శరద్ తాజాగా వీటిపై మాట్లాడారు. ఢిల్లీకి చెందిన జయశ్రీ రెండు దశాబ్దాలుగా వైద్యవృత్తిలో ఉన్నారు. తన స్వీయ అనుభవాలని ఆమె ఇలా వివరించారు.

మెనోపాజ్ సమయానికి ముందు వచ్చే ఈ సమస్యలని పెరిమెనోపాజ్ అంటారు. సాధారణంగా 40 ఏళ్లు దాటిన మహిళలు క్రమంగా ఈ స్థితికి గురవుతుంటారు. నా దగ్గరికి వచ్చే చాలామంది మహిళలు చర్మ సంబంధిత వ్యాధులతో, జుట్టు ఊడిపోవడం, పొడిబారడం వంటి సమస్యలపై ఆందోళనతో ఉండేవారు. ముఖం, శరీరంపై కొత్త లేదా నల్లగా మారే హైపర్ పిగ్మెంటేషన్, తామర, దురద, వృద్ధాప్య ఛాయలు వంటి సమస్యలతో బాధపడుతుండేవారు.

మార్పు వస్తోందని గ్రహించాలి: 'రాత్రికి రాత్రే నేనెందుకు పెద్ద వయసుదానిలా కనబడుతున్నాను' అని ఎవరికైనా అనిపిస్తే ఆ మహిళలు కచ్చితంగా పెరీమెనోపాజ్ గురించి అవగాహనకి రావాలి. అంటే దీనర్థం ఈ స్థితి వారి చర్మానికి లోపల, బాహ్యంగా ఏం జరు గుతుందో తెలుసుకోవడానికి దోహదపడుతుంది. ఇంకాస్త వివరంగా చెప్పాలంటే.. ఈస్ట్రోజెన్,

ప్రొజెస్టెరాన్, ఆండ్రోజెన్‌లని ప్రభావితం చేసే హార్మోన్లలో మార్పు వస్తోందని గ్రహించాలి. ఈ హార్మోన్లు పునరుత్పత్తిని మాత్రమే కాకుండా కొల్లాజెన్, సెబమ్ ఉత్పత్తి, చర్మంపై తేమ సమతుల్యతని నియంత్రిస్తాయి. అలాంటి ఈ హార్మోన్లు హెచ్చుతగ్గులకి గురైనప్పుడు తల నుండి పాదాల వరకు ప్రతి ఒక్కటి, భావోద్వేగాల పరంగా కూడా ప్రతిదీ అస్థిరంగా అనిపిస్తుంది.

ప్రతి ఒక్కటీ విరుద్ధంగా జరిగింది: నాకు పెరిమెనోపాజ్ మొదలైనప్పుడు, ఒక డాక్టరుగా నేను అన్నింటికీ సిద్ధంగా ఉన్నాను అనుకున్నాను. చాలామంది మహిళలకి ఈ సమస్యలపై కౌన్సిలింగ్ ఇచ్చాను కాబట్టి, దీన్ని అధిగమించడం చాలా తేలిక అని కూడా భావించాను. కానీ అందుకు విరుద్ధంగా ప్రతి ఒక్కటీ జరిగింది. నా పీరియడ్స్ ఆగలేదు. అంటే నేను ఇంకా మెనోపాజ్‌కి రాలేదు. కానీ లక్షణాలు దాదాపు నాలుగేళ్లు బాధించాయి. రాత్రిపూట తీవ్రంగా చెమటలు పట్టేవి. ఎసి టెంపరేచర్ 18 డిగ్రీ సెల్సియస్‌కి తగ్గించినా మార్పు ఉండేది కాదు. చలితో వణికిపోతున్నా చెమటలు తగ్గేవి కావు. తరచూ వెర్టిగోతో కూడిన మైగ్రేన్లు వచ్చేవి. ఎక్కువగా అలిసిపోయేదాన్ని. చర్మం పొడిబారేది. దురద పుట్టేది. రాత్రుళ్లు నిద్రపట్టేది కాదు. ఇవన్నీ ఒక ఎత్తయితే.. క్షణాల వ్యవధిలోనే నాలో భావోద్వేగ లక్షణాలు మారిపోతూ ఉండేవి. నిమిషాల్లోనే కోపం వచ్చేది. ఒక్కోసారి కోపం కన్నీళ్లకి దారితీసేది. రోజంతా ప్రశాంతంగా కూర్చొని రోగులకి చికిత్స అందించాల్సిన నేను ఈవిధంగా నాపై



నాకు నియంత్రణ కోల్పోవడం చాలా ఇబ్బందిగా అనిపించేది. భరించలేని బాధగా ఉండేది.

ఇలా ఎందుకు జరుగుతుంది అంటే..: ఈస్ట్రోజెన్ హార్మోన్ సెరోటోనిన్, డోపమైన్ మార్గాలతో సంఘర్షణ చెందుతుంది. ఆ పరిస్థితిలో పెరిమెనోపాజ్ ఉండే మహిళల మానసిక స్థితిలో మార్పులు, ఆందోళనలు, నిరాశ సాధారణంగా కనిపిస్తాయి. 60 నుండి 70 శాతం మహిళలు ఈ పరిస్థితి కారణంగా నిద్రలేని రాత్రులు అనుభవిస్తున్నారని పలు నివేదికలు చెబుతున్నాయి.

అందరికీ ఒకేలా ఉండవు: పెరిమెనోపాజ్‌లో వచ్చే సమస్యలని అధిగమించేందుకు నేను మెనోపేస్, మెనో-ఈజ్, ఐసోఫ్లేవోన్స్, మల్టీ విటమిన్ల ద్వారా ఈ సమస్యలని దూరం చేసుకోవాలనుకున్నాను. అయితే ఇవేమీ నాకు ఉపశమనం ఇవ్వలేదు. చివరికి నా గైనకాల జిస్ట్‌ని కలిశాను. ఈస్ట్రోజెన్ జెల్‌ని వాడమని తను చెప్పారు. అది వాడినప్పుడు మొదట మైగ్రేన్లు తీవ్రంగా వచ్చేవి. కాని క్రమంగా ఆగిపోయాయి. అలాగే పెరిమెనోపాజ్ లక్షణాలు కూడా తగ్గుముఖం పట్టాయి. అయితే అందరికి ఇలా ఉండకపోవచ్చు. వారు పాటించే ఆహారనియమాలు, వైద్యచరిత్రని బట్టి కూడా ఈ చికిత్స ఫలితాలు ఉంటాయి.

వైద్యుల సలహా తప్పనిసరి: పెరిమెనోపాజ్ లక్షణాల నుండి ఉపశమన పొందేందుకు కొంతమంది హార్మోన్ రీప్లేస్‌మెంట్ థెరపీ (హెచ్‌ఆర్‌టి)ని తీసుకుంటారు. ఈ చికిత్స ఉత్తమమైనది. మంచి నిద్ర, మానసిక స్థితి స్థిరత్వం, చర్మ ఆరోగ్యం మెరుగుపడడం వంటివి ఉంటాయి. అయితే ఈ చికిత్స అందరికీ సరిపోయేది కాదు. హెచ్‌ఆర్‌టికి వెళ్లే ముందు తప్పనిసరిగా 'లిపిడ్ ప్రొఫైల్', 'కాలేయ పనితీరు', 'రొమ్ము, గర్భాశయ స్క్రీనింగ్'తో సహా నిపుణులైన వైద్యుల సలహా తీసుకోవడం అవసరం. నార్త్ అమెరికన్ మెనోపాజ్ సొసైటీ (ఎన్ఎఎంఎస్ 2023) ప్రకారం, 60 ఏళ్ల లోపు లేదా మెనోపాజ్ తర్వాత 10 సంవత్సరాల లోపు ఆరోగ్యవంతమైన మహిళలకి హెచ్‌ఆర్‌టి ప్రయోజనాలు ముఖ్యంగా వాసోమోటార్, యురోజెనిటల్ లక్షణాల ప్రమాదాలని అధిగమిస్తాయి. అయితే హెచ్‌ఆర్‌టి ఎప్పుడూ 'అర్హత కలిగిన,



నిపుణులైన గైనాకాలజిస్ట్ పర్యవేక్షణలోనే తీసుకోవాలి.

జుట్టు ఆరోగ్యం కోసం : బయోటిన్, మైక్రో న్యూట్రియన్లని తీసుకోవాలి. విటమిన్ ఎ, బి-కాంప్లెక్స్, విటమిన్ సి, డి, ఇ, మెగ్నీషియం గ్లైసినేట్, సెలీనియం, క్రోమియం, ఒమేగా-3, కొవ్వు ఆమ్లాలు జత చేయాలి. ప్రొటీన్ ఫుడ్ ఎక్కువగా తీసుకోవాలి. కిలో శరీర బరువుకు 1.2 గ్రాముల ప్రొటీన్ రోజువారీ ఆహారంలో ఉండేలా చూసుకోవాలి.

చర్మ ఆరోగ్యం కోసం : తేలికైన క్లెన్సర్‌ని ఉదయం, రాత్రిపూట వాడాలి. చర్మంపై తేమని కాపాడేందుకు హైలురోనిక్ ఆమ్లం, సెరామైడ్ ఆధారిత మాయిశ్చరైజర్‌ని ఉపయోగించాలి. రాత్రి సమయంలో ఒక్కోసారి విటమిన్ సి సీరం, రెటినోల్ సీరం, షియా వెన్నని వినియోగించాలి. వీటితోపాటు సమతుల్య ఆహారాన్ని క్రమపద్ధతిలో తీసుకోవాలి.పెరి మెనోపాజ్ జీవసంబంధమైన మార్పుగా అందరూ భావించాలి. థైరాయిడ్, విటమిన్ డి, ఐరన్, గ్లూకోజ్ లోపాలతో బాధపడేవారిలో ఈ లక్షణాలు మరింత తీవ్రంగా ఉంటాయి. కాబట్టి ఈ పరిస్థితిని అనుభవిస్తున్న వారు 'మీరు విచ్ఛిన్నం అవ్వడం లేదు. మార్పుకు గురవుతున్నారు' అని గ్రహించాలి.

# రామయపల్లి గ్రామాన్ని సింగరేణి సంస్థ తీసుకోవాలి



**కమాన్ పూర్,తెలంగాణ దిశ :** వ్యవసాయ భూములు మాత్రమే తీసుకుంటామంటే ఊరుకునేది లేదని రామయ్యపల్లి గ్రామాన్ని కూడా సింగరేణి సేకరించాలి అని పేర్కొన్నారు.సింగరేణి విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటం చేస్తాం మాజీ ఎంపీపీ అరెల్లిదేవక్క కొమురయ్యగౌడ్ హెచ్చరించారు రామగిరి మండలంలోని సింగరేణి ఓసీపీ టూ విస్తరణ కోసం సింగరేణి యాజమాన్యం రాజా పూర్ గ్రామంతోపాటు 444 ఎకరాల భూమిని తీసుకుంటామని ప్రతిపాధిస్తున్నట్టు సింగరేణి జీఎం చెప్పడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు రామగిరి మాజీ ఎంపీపీ అరెల్లి దేవక్క కొమురయ్యగౌడ్ పేర్కొన్నారు. సింగరేణి ఓసీపీ టూ విస్తరణలో భాగంగా పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం బుధవారంపేట, రాజాపూర్ గ్రామాల పరిధిలోని 708 ఎకరాల వ్యవసాయ భూమిని గతంలో సింగరేణి అధికారులు స్వాదీ నం చేసుకున్నారు. దీనిపై రెండు గ్రామాల రైతులు కోర్టుకు వెళ్లగా ఆ భూమిని తిరిగి రైతులకు ఇవ్వడం జరిగింది. తదురపరి 88 ఎకరాలను మాత్రమే తీసుకున్న సింగరేణి అధికారులు.. ఇప్పుడు మరోసారి కుట్రపూరితంగా రాజాపూర్ గ్రామాన్ని మాత్రమే తీసుకుం టామని చెప్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజాపూర్ గ్రామాన్ని తీసుకుంటామని చెప్తున్న సింగరేణి అధికారులు.. రామయ్యపల్లి గ్రామాన్ని తీసుకోకుండా కేవలం రామయ్యపల్లి గ్రామ పరిధిలోని వ్యవసాయ భూములను మాత్రమే తీసుకోవడం వల్ల గ్రామస్థులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో పెద్దంపేట, మంగళ్ పల్లి, వకీల్ పల్లి గ్రామాల ప్రజలు పడ్డ ఇబ్బందులను కండ్లారా చూసిన మేము ఎట్టిపరిస్థితిలో అటువంటి సమస్యలను ఎదుర్కొనేందుకు సిద్దంగా లేమని అన్నారు. ఇప్పటికైనా సింగరేణి అధికారులు మా వ్యవసాయ భూమలు సేకరించే ప్రతిపాదనను విరమించుకోవడమో.. లేదంటే మా గ్రామాన్ని సైతం తీసుకుని గ్రామస్థులకు తగు రీతిలో న్యాయం చేయడమో ఏదో ఒకటి చేసే విధంగా అడుగులు వేయాలని హితవు పలికారు. అలా చేయని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమ కార్యాచరణ ప్రకటించి సింగరేణి విస్తరణకు వ్యతిరేకంగా పోరాటం చేస్తామని హెచ్చరించారు. పోరాటాలు మా ఊరి ప్రజలకు కొత్త కాదని, గతంలో దొరలను సైతం ఉరికించిన చరిత్ర గ్రామానికి ఉందనే విషయాన్ని సింగరేణి అధికారులు గమనంలోకి తీసుకోవాలని సూచించారు.

# సుప్రీం తీర్పు...గవర్నర్ల వ్యవహారం !

పదవీ విరమణ చేయబోతున్న సమయంలో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ బుధ, గురు వారాల్లో రెండు రాజ్యాంగ ధర్మాసనాలకు నేతృత్వం వహించి తీర్పులిచ్చారు. రాష్ట్రపతి న్యాయ సలహా కోరిన అంశంపై గురువారం ఏకాభిప్రాయంతో తీర్పు సంచలనంగానే పేర్కొనాలి. ఎందుకంటే తమిళనాడు కు సంబంధించిన పలు బిల్లులను గవర్నర్ ఆమోదించకుండా తొక్కిపెడుతుండటంతో అక్కడి ప్రభుత్వం హైకోర్టును ఆశ్రయించింది. సహేతుకమైన సమయంలో నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు గవర్నర్‌ను ఆదేశించింది. బిల్లులను తొక్కిపట్టే విధానాన్ని తప్పుబట్టింది. అయితే, గవర్నర్ మాత్రం బిల్లులను ఆమోదించలేదు. ఈ నేపథ్యంలో తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సుప్రీంకోర్టు ద్విసభ్య బెంచ్ ఈ ఏడాది ఏప్రిల్ 8న సంచలన తీర్పు వెలువరించింది. గవర్నర్ రాజ్యాంగ విరుద్ధంగా పది బిల్లులను నిరవధికంగా తొక్కిపట్టారని ప్రకటించింది. రాజ్యాంగ విధుల్లో విఫలయ్యారని, రాజ్యాంగబద్ధ పాలన కూలిపోయే పరిస్థితి కల్పించారని మండిపడింది. బిల్లులు తిప్పిపంపకుండా దగ్గర పెట్టుకోవడం కుదరదని చెప్పింది. తిప్పి పంపిన తర్వాత మళ్లీ శాసనసభ ఆమోదిస్తే గవర్నర్ ఆమోదించాల్సిందేనని స్పష్టం చేసింది. గవర్నర్‌కు పంపిన బిల్లులు ఆమోదం పొందినట్లుగా పరిగణిస్తున్నట్లు తెలిపింది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం మే 13న రాష్ట్రపతి ద్వారా సుప్రీంకోర్టును 14 ప్రశ్నలతో న్యాయ సలహా కోరింది. వాటికి సుప్రీంకోర్టు గురువారం సమాధానం ఇచ్చింది. వాదనల సమయంలో ఏప్రిల్ 8 నాటి సుప్రీంకోర్టు తీర్పును తోసిపుచ్చే ఉద్దేశం లేదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ పదేపదే చెప్పారు. గురువారం నాటి తీర్పు కాపీలోనూ... మరో తీర్పును తోసిపుచ్చేందుకు రాష్ట్రపతి ఆర్టికల్ 143 కింద సలహా కోరడాన్ని ఉపకరణంగా వాడటం కుదరదని పేర్కొంది. ప్రత్యేకించి కొన్ని రాష్ట్రాల్లో గవర్నర్లు ఆయా ప్రభుత్వాలకు వ్యతిరేకంగా కొంత పెత్తనం చెలాయిస్తున్నారు. ప్రధానంగా బిల్లుల ఆమోదం విషయంలో వారు సకాలంలో నిర్ణయం తీసుకోవడం లేదు. లేదా తిప్పి పంపడం లేదు. ప్రధానంగా బెంగాల్, తమిళనాడు, తెలంగాణల్లో ఇలాంటి పరిస్థితులను చూశాం. అయితే రాష్ట్రపతి, గవర్నర్లకు బిల్లుల ఆమోదంలో గడువు విధించడం తగదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయి నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం ఇటీవలే తేల్చిచెప్పింది. ఈ తీర్పుతో ఇప్పుడు గవర్నర్ల వద్ద బిల్లులు పెండింగ్‌లో ఉన్నా ప్రశ్నించే అవకాశం లేకుండా పోయింది. అలాగే బిల్లులను సకాలంలో పంపాలన్న నిబంధన లేకపోతే వారు రాష్ట్ర ప్రభుత్వాలపై పెత్తనం చెలాయిస్తారని తమిళనాడు, బెంగాల్ తదితర రాష్ట్రలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ క్రమంలో పార్లమెంట్ దీనిపై చర్చించాల్సి ఉంది. గవర్నర్లకు ఉండే వెసలుబాటులోనూ సమయాభావన ఉండాలన్న దానిపై చర్చించాలి. అవసరమైతే చట్టపరంగా మార్పులకు శ్రీకారం చుట్టాలి.అప్పుడే రాష్ట్రాల్లో ప్రభుత్వాలు తీసుకునే నిర్ణయాలకు ఆమోదం దక్కుతుంది. రాష్ట్ర ప్రభుత్వాలు పంపిన బిల్లుల ఆమోదంలో గవర్నర్ సొంత విచక్షణతో నిర్ణయం తీసుకోవచ్చని కూడా స్పష్టం చేసింది. అయితే, గవర్నర్ ఎటువంటి కారణం చెప్పకుండా నిరవధికంగా ఆలస్యం చేయడం తగదని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ ఏఎస్ చంద్రశేఖర్ సభ్యులుగా ఉన్న ధర్మాసనం అభిప్రాయ పడింది. అటువంటి సమయంలో సహేతుకమైన సమయంలో నిర్ణయం తీసుకోవా లని గవర్నర్‌ను న్యాయస్థానం ఆదేశించవచ్చని చెప్పింది. రాష్ట్రాల శాసన సభలు ఆమోదించి పంపించిన బిల్లులకు గవర్నర్ సమ్మతి తెలిపే అంశానికి సంబంధించి దేశ అత్యున్నత న్యాయస్థానం గురువారం కీలక నిర్ణయాన్ని వెలువరించింది. రాష్ట్రపతి, గవర్నర్లు తీసుకునే చర్యలు న్యాయస్థానాల పరిశీలనకు అతీతం కాదని చెబుతూనే రాజ్యాంగ అధినేతలకు బిల్లుల ఆమోదం కోసం గడువు విధించడం సరైంది కాదని స్పష్టం చేసింది. రాష్ట్రపతి రాజ్యాంగాధినేత కావడం వల్ల కొంత ఆలోచన చేయవచ్చు. కానీ గవర్నర్లు ఈ విషయంలో కొంత రాజ్యాంగబద్ధంగా వ్యవహరించాల్సి ఉంటుంది. ఎందుకంటే బిల్లులను తొక్కిపెట్టి కాలయాపన చేయడం వల్ల తీసుకోవాల్సిన నిర్ణయాలు ఆలస్యం అవుతున్నాయి. సుప్రీం తీర్పు తరవాత తమిళనాడు సిఎం స్టాలిన్ కూడా స్పందించారు. గవర్నర్లకు సమయం ఉండాలని, నిర్దేవజత గడువు ఉండాలని అభిప్రాయపడ్డారు. ఇందుకోసం అవసరమైతే రాజ్యాంగ సవరణ జరగాలన్నారు. ఇకపోతే గవర్నర్‌కు రాజ్యాంగపరంగా మూడు ఆప్షన్లు ఉంటాయని సుప్రీంకోర్టు తెలిపింది. ఒక బిల్లు గవర్నర్ దగ్గరికి వచ్చినప్పుడు అన్నీ పరిశీలించి సమ్మతి తెలియ జేయడం లేదా ఏదైనా సహేతుకమైన కారణం చెప్పి బిల్లును రిజర్వ్‌లో పెట్టడం లేదా రాష్ట్రపతికి పంపడం చేయాలి. లేదా బిల్లును తిరస్కరించి తిరిగి అసెంబ్లీకి పంపడం చేయాలి. కానీ చాలా సందర్భాల్లో అలా జరగడం లేదు. తమిళనాడు గవర్నర్ రవి ఇలాంటి నిబంధనలు పక్కన పెట్టారు. తెలంగాణ గవర్నర్‌గా ఉన్న సమయంలో తమిళిసై సైతం ఇదే ధోరణితో ఉన్నారు. ప్రభుత్వాలు ఏదైనా నిర్ణయం తీసుకుంటే సకాలంలో ఔనని లేదా కాదని చెబితే బాగుండేది. కానీ దానిపై సమాధానం ఇవ్వక పోవడం అన్నది, ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టేదే తప్ప మరోటి కాదు. అయితే ఈ మూడు ఆప్షన్లు ఎంచుకోవడంలో రాజ్యాంగంలోని 200 నిబంధన కింద గవర్నర్ విచక్షణాధికారాన్ని ఉపయోగిస్తారని, అటువంటి సమయంలో న్యాయస్థానాలు గడువు విధించడం సరికాదని సుప్రీం రాజ్యాంగ ధర్మాసనం అభిప్రాయ పడింది. బిల్లులకు ఆమోదం తెలిపేటప్పుడు కానీ, ఆమోదాన్ని నిలిపివేసే సమయంలో కానీ గవర్నర్ తన సొంత విచక్షణ ప్రకారం వ్యవహరించవచ్చని కూడా సూచించింది. అలాంటి సమయాల్లో మంత్రి మండలి సలహా ప్రకారం నడుచుకోవాల్సిన అవసరం లేదు. అయితే, సుదీర్ఘకాలం వివరించలేని కారణాల వల్ల ఒక బిల్లుపై నిర్ణయం తీసుకోకపోతే సహేతుకమైన సమయంలో నిర్ణయం తీసుకోవలసిందిగా కోర్టు గవర్నర్‌కు పరిమితమైన ఆదేశాలు జారీ చేయవచ్చని తెలిపింది. 361 అధికరణ కింద వారికి రక్షణ కవచం ఉన్నప్పటికీ సుదీర్ఘమైన ఆలస్యం జరిగినప్పుడు హేతుబద్ధమైన సమయంలో బిల్లులను ఆమోదించేందుకు, తిరిగి పంపేందుకు న్యాయస్థానం ఆదేశాలు జారీ చేయవచ్చని తెలిపింది. ఇకపోతే తన పరిశీలనకు వచ్చిన ప్రతి బిల్లుపై రాష్ట్రపతి రాజ్యాగంలోని 143వ అధికరణం కింద సుప్రీంకోర్టు సలహా కోరనవసరం లేదు. గవర్నర్లు నిరవధికంగా ఒక బిల్లును తమ వద్ద ఉంచుకోరాదు అనేదే ప్రధానం. అందువల్ల పరిమితమైన న్యాయ సమీక్ష ఉండవచ్చని రాజ్యాంగ ధర్మాసనం తన ఏకగ్రీవ తీర్పులో అభిప్రాయపడింది. రాజ్యాంగంలో బిల్లును సాధ్యమైనంత త్వరగా ఆమోదించాలని ఉన్నప్పటికీ దాన్ని గవర్నర్లకు, రాష్ట్రపతికి డెడ్‌లైన్ పెట్టేందుకు రాజ్యాంగం ఇచ్చిన అనుమతిగా భావించనక్కరలేదని రాజ్యాంగ ధర్మాసనం స్పష్టం చేసింది. డెడ్‌లైన్ పెట్టి, ఆలోగా ఆమోదం ఇవ్వకపోతే లభించినట్లుగానే భావించడం రాజ్యాంగంలోని అధికారాల విభజన సూత్రానికి భంగం కలిగిస్తుందని తెలిపింది. మొత్తంగా గవర్నర్లకు ఇప్పుడు విచక్షణ ఉందని తేల్చింది. అంటే బిల్లులను ఎంతకాలమైనా పెండింగ్‌లో పెట్టుకునే అవకాశం ఉంది. అయితే అది ఎంతకాలం అన్న చర్చ జరగాలి. లేదా దానికి కూడా పరిమిత కాలం అంటూ ఉండాలి. అప్పుడే గవర్నర్ల పెత్తనం అతిగా ఉండదు. తమిళనాడు వ్యవహారం, సుప్రీం తీర్పు నేపథ్యంలో గవర్నర్లకు సంబంధించి తప్పకుండా చర్చచేయాల్సి ఉంది. ఇందుకు పార్లమెంట్ పూనుకోవాలి. ఇలాంటి విషయాల్లో విపక్షపార్టీ సభ్యులు చర్చకు పట్టుబట్టాలి. అప్పుడు సమస్యకు మార్గం దక్కగలదు.

# డాక్టర్‌కు వీసా నిరాకరణతో ఆత్మహత్య

**హైదరాబాద్,తెలంగాణ దిశ :**వీసా రాకపోవడంతో ఓ వైద్యురాలు ఆత్మహత్యకు పాల్పడ్డారు. హైదరాబాద్ పద్మారావు నగర్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. కొద్ది రోజుల క్రితం డాక్టర్ రోహిణికి వీసా నిరాకరించి నట్లు తెలుస్తోంది. దీంతో ఆమె మనస్థాపం చెంది నిద్రమాత్రలు మింగినట్లు సమాచారం. ఈ క్రమంలోనే రోహిణి గదిలో సూసైడ్ నోట్ లభ్యమైంది. వైద్యురాలు మృతితో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. చిలకలగూడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రోహిణి మృతదేహానికి వైద్యులు పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. గుంటూరులో ఆమె అంత్యక్రియలను కుటుంబ సభ్యులు పూర్తి చేశారు.

# మోడీని ప్రత్యర్థులు గెలిపిస్తున్నారు !



2019 ఎన్నికల తర్వాత ఆమ్ ఆద్మీ పార్టీ నేత అరవింద్ కేజ్రీవాల్ ఓ ఇంటర్వ్యూలో చెప్పిన మాట ఇది. కేజ్రీవాల్ మోడీ అభిమని కాదు. కానీ ఎన్నికల ఫలితాలను చూసి ఆయనకు అలా చెప్పాలని అనిపించింది. ఇప్పటికి ఆరేళ్లు గడిచాయి. ఎన్నో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. పార్లమెంట్ ఎన్నికలూ జరిగాయి. కానీ అరవింద్ కేజ్రీవాల్ చెప్పింది మాత్రం తప్పు కాలేదు. ఇప్పటికీ మోదీని ఎవరూ ఓడించలేక పోతున్నారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో సాధారణ రాజకీయ పరిజ్ఞానం ఉన్న వారికి బీజేపీ, నితీష్ కూటమి గెలుస్తుందన్న నమ్మకం లేదు. ఎందుకంటే అక్కడ 20 ఏళ్లలో మధ్యలో కొద్ది రోజులు తప్ప అంతా నితీష్ కుమారే సీఎంగా ఉన్నారు. అంతకు ముందు ఎప్పుడో ఏడేళ్ల పాటు సీఎంగా చేసిన లాలూ ప్రసాద్ యాదవ్ జంగిల్ రాజ్ ను గుర్తు చేసి.. ఆయనను ఇరవై ఏళ్లుగా ఓడిస్తున్నారు. కానీ ఇరవై ఏళ్ల పాటు బీహార్ .. దేశంతో పాటు ముందుకు పోలేదని అక్కడి ప్రజలు వలస బాటలో ఉండి.. ఇతర రాష్ట్రాల్లో దుర్భరమైన జీవితాన్ని అనుభవి స్తున్నారని మాత్రం గుర్తించడం లేదు. ఇరవై ఏళ్లలో చాలా రాష్ట్రాలు ముందుకెళ్లాయి. కానీ బీహార్ ప్రజలు మాత్రం ఆయా రాష్ట్రాల్లో కూలీ పనులు చేసుకోవడానికే ఉయోగపడుతున్నారు. ఎందుకు బీహార్ మారడం లేదని ప్రజలు ప్రశ్నిస్తారని ..నితీష్ కుమార్ ను తరిమేస్తారని అనుకున్నారు. కానీ జరిగింది వేరు. తిరుగులేని మెజార్టీతో బీజేపీ, జేడీయూ కూటమి అధికారంలోకి వచ్చింది. ఈ ఫలితాలను చూసి అందరూ మరోసారి మోడీ జయహో అంటున్నారు. ఆయనను ఓడించే లీడర్ లేదని.. ఆయనకే విసుగు వచ్చి రిటైర్మెంట్ తీసుకుంటేనే ఇతరులకు అవకాశం వస్తుందని విశ్లేషిస్తున్నారు. జరుగుతున్న రాజకీయాలను.. వస్తున్న ఫలితాలను చూస్తే.. కేజ్రీవాల్ అభిప్రాయం తో విభేధించేవారు దాదాపుగా ఉండరు.నరేంద్రమోడీ ఎలా గెలుస్తు న్నారు? ఇది చాలా మందికి అర్థం కాని విషయం. ఖచ్చితంగా ఓడిపోతారనుకున్న చోట్ల గెలుస్తున్నారు. గెలుస్తారని అనుకున్న చోట్ల ఇంకా బీభత్సంగా గెలుస్తున్నారు. అలాగని ఆయనకు గెలుపులే కాదు కొన్ని పరాజయాలూ ఉన్నాయి. అవి ఆయన ఇమేజ్ ను ఏ మాత్రం తగ్గించడం లేదు. ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత భారతీయ జనతా పార్టీకి తిరుగులేకుండా పోయింది. ఒకప్పుడు కొన్ని ప్రాంతాల కే పరిమితమైన పార్టీ ఇప్పుడు అంతటా విస్తరించింది. బెంగాల్ లాంటిచోట్ల కూడా పాతుకుపోయిందంటే.. ఇక తెలంగాణ ఓ లెక్క లేదు. 2014 మే 26న నరేంద్ర మోడీ ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసినప్పటి నుంచి అన్నీ తిరుగు లేని విజయాలే వచ్చాయి. 2022 గుజరాత్‌లో 156 సీట్లతో 'ఎవర్-విన్నింగ్' రికార్డ్, 2024 మహారాష్ట్రలో 132 సీట్లతో 88% స్ట్రైక్ రేట్ మోడీ హయాంలో బీజేపీ అసెంబ్లీల్లో రికార్డుల సృష్టించింది. 2017లో జఖలో 312 సీట్లు సాధించింది. 2018లో రాజస్థాన్, చత్తీస్‌గఢ్‌లో మెజారిటీలు. 2019లో కాంగ్రెస్‌ను దాటి ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా మారిం ది. గుజరాత్‌లో 3 ముఖ్యమంత్రులు మారినా 156 సీట్లు వచ్చాయి. మరోసారి గుజరాత్ లో ఎన్నికలు జరిగినా బీజేపీనే గెలుస్తుంది. మరో పార్టీ గెలిచేఅవకాశం లేదు. ఎందుకంటేఅక్కడ ప్రత్యర్థి ఎదగడం లేదు.ఒక్క గుజరాత్ కాదు.. చాలా రాష్ట్రాల్లో బీజేపీనిమళ్లీమళ్లీ గెలిపిస్తు న్నారు కానీ.. ప్రత్యామ్నయంగా ఉన్న పార్టీలకు అసలు చాన్స్ రావడం లేదు. అలాంటి రిస్క్ తీసుకోవాలని ప్రజలు అనుకోవడం లేదు.

బీజేపీ, మోడీ ఇలా ఎందుకు గెలుస్తున్నారంటే.. దానికి ప్రధాన కారణం?మోదీకి ధీటైన నేత లేకపోవడం మాత్రమే కాదు?విపక్షాల్లో సరైన ఐక్యత లేకపోవడం కూడా. కేజ్రీవాల్ చెప్పినట్లుగా ఆయన వ్యతిరేకులు కూడా ఆయనను గెలిపించేందుకు ప్రయత్నిస్తూ ఉంటారు. సాయం చేస్తూ ఉంటారు. కాకపోతే నేరుగా కాదు.. వారి చేతకాని తనం, అనైక్యత వల్ల. 2014లో బీజేపీ ఒంటరిగా 282 సీట్లు, 2019లో 303 సీట్లు, 2024లో కూటమితో 293 సీట్లు గెలుచుకోగలిగినప్పుడు కాంగ్రెస్-నేతృత్వంలోని యూపీఏ 2014లో 44 సీట్లకు, 2019లో 52 సీట్లకు పరిమితమైంది. 2024లో ఎఔఅఎం కూటమి 234 సీట్లు సాధించినా, ఒక్క రాష్ట్రంలో కూడా బీజేపీని పూర్తిగా తుడిచిపెట్టలేకపోయింది. అసెంబ్లీ పరంగా కూడా అంతే. ఉత్తరప్రదేశ్‌లో 2017లో 312 సీట్లు, గుజరాత్‌లో 2022లో 156 సీట్లు, మహారాష్ట్రలో 2024లో 132 సీట్లు ఈ రికార్డులు సృష్టించినప్పుడు విపక్షాలు విడివిడిగా పోటీ చేశాయి., ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాదీ పార్టీ-కాంగ్రెస్ కూటమి 2022లో కూడా బీజేపీని ఆపలేకపోయింది. కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌లో రీజనల్ పార్టీలు బలంగా ఉన్నా, జాతీయ స్థాయిలో ఒకే నినాదం, ఒకే నాయకత్వం లేకపోవడం బీజేపీకి లాభించింది. అందుకే "బీజేపీ గెలవడం కంటే విపక్షాలు ఓడిపోతున్నాయి" అని ఎక్కువగా అభిప్రాయం వినిపిస్తోంది. బీజేపీ యంత్రాంగం, ఆర్ఎస్ఎస్ నెట్‌వర్క్, కార్పొరేట్ ఫండింగ్, మీడియా డామినెన్స్, ఏజెన్సీల వినియోగం ? ఇవన్నీ కూడా విపక్షాలను బలహీనపరుస్తున్నాయి. అలాగే విపక్షాలు తమ ఇంటర్నల్ గొడవలు, నాయకత్వ సంక్షోభం, స్థానిక-జాతీయ వ్యూహాల మధ్య అంతరం తొలగించుకోలేకపోవడంతో.. మోదీ పని సులువు అవుతోంది.విపక్షాల బలహీనత ఎక్కువే. కానీ మోదీ పాలనా విజయాలను తక్కువ చేయలేం. దేశానికి రాచపుండులా పట్టి పీడిస్తున్న సమస్యలకు ఆయన సులువుగా పరిష్కారం చూపించారు. స్వాతంత్ర్యం వచ్చిన 77 ఏళ్లలో ఎవరూ తాకలేని, తాకితే రాజకీయంగా నష్టోతామని అధికారంలో ఉన్న పార్టీలు భయపడిన అతి సున్నితమైన సమస్యలను నరేంద్ర మోదీ ప్రభుత్వం ధైర్యంగా ఎదుర్కొని శాశ్వతంగా పరిష్కరించింది. ఈ నిర్ణయాలు కేవలం చట్టపరమైన మార్పులు మాత్రమే కాదు ? దేశ ఐక్యత, భావోద్వేగాలు, జాతీయ గర్వాన్ని తాకిన చారిత్రాత్మక విజయాలు. 2019 ఆగస్టు 5న పార్లమెంట్ రెండు సభల్లోనూ ఆర్టికల్ 370, 35ం రద్దు చేసి జమ్మూ-కాశ్మీర్‌ను రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా మార్చారు. 1949లో "తాత్కాలిక నిబంధన"గా పెట్టిన ఈ ఆర్టికల్‌కు ఏడు దశాబ్దాల తర్వాత శాశ్వత ముగింపు పలికారు. ఫలితంగా కశ్మీర్ మారిపోయింది. 492 ఏళ్ల రామజన్మభూమి ? బాబ్రీ మసీదు వివాదానికి మోదీ హయాంలోప రిష్కారం లభించింది. దేశవ్యాప్తంగా ఒక్క గొడవ లేకుండా శాంతియుతంగా పరిష్కారం జరగడం చరిత్రలోనే అరుదైన ఘట్టం. ఆలయం కూడా నిర్మితమయింది. ఇప్పుడు అయోధ్య రోజుకు 2-3 లక్షల భక్తులతో నిండిపోతోంది ? హిందూ-ముస్లిం సామరస్యానికి చిహ్నంగా మారింది. ఈశాన్య రాష్ట్రాల్లో 2014 వరకు 30కి పైగా సాయుధ సంస్థలు యాక్టివ్‌గా ఉండేవి. మోదీ ప్రభుత్వం 11 ఏళ్లలో 12 పెద్ద శాంతి ఒప్పందాలు కుదుర్చుకుంది . దాదాపు 10,000 మంది మిలిటెంట్లు ఆయుధాలు వదిలిపెట్టారు. 1947 విభజన తర్వాత పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్ నుంచి వచ్చిన హిందూ, సిక్కు, జైన్, బౌద్ధ, పార్సీ శరణార్థులకు 2024 మార్చి 11 నుంచి సీఏఏ కింద పౌరసత్వం మంజూరు ప్రారంభమైంది. ఇప్పటివరకు 14,000 మందికి పౌరసత్వం ఇచ్చారు. దశాబ్దాలుగా శిబిరాల్లో బతుకుతున్న వారికి గౌరవప్రదమైన జీవితం లభిస్తోంది. ఈ సమస్యలను ఎవరైనా పరిష్కరించచగలరని ఎవరూ ఊహించలేదు. కానీ మోదీ చేశారు. ఇవే కాదు.. అభివృద్ధి పరంగా, మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల రంగా .. గత పదకొండేళ్లలో దేశంలో అనూహ్యమైన మార్పులువస్తున్నాయి. ఇది మోదీ పాలనా ఘనతే. మోడీ ప్రధాని అయితే ముస్లింలకు బ్రతుకు ఉండదని చాలా మంది అనుకున్నారు. కానీ అలాంటి అనుమానాలను మోడీ ఏటా పంచలు చేశారు. ముస్లింలపై దేశంలో ఎక్కడా వివక్ష లేదు. ప్రభుత్వ పరంగా వారిపై బాధ్యతలను ఎప్పుడూ విస్మరించలేదు. పాలనలో వెల్ఫేర్ పథకాలు, శిక్షణలు, ఆర్థిక సహాయాలు ముస్లింలకు రేషియో ప్రకారం అందుతున్నాయి. మైనారిటీలకు రూ. 22,000 కోట్లు 2014-2024మధ్యలో కేటాయించారు. ముస్లింలకు రూ. 32 కోట్లు స్కాలర్షిప్‌లు, ఖఓంజలో 11.8కోట్ల ఇళ్లలో మైనారిటీలకు ప్రాధాన్యత , అయుష్మాన్ భారత్‌లో ముస్లింలు లబ్ధిదారులు, ముస్లిం మహిళలకు త్రిపుల్ తలాక్ రద్దు వంటివి చేసి చూపించారు.. నరేంద్రమోడీ గెలుపుల గురించి.. "నరేంద్ర మోడీ ఒక వ్యక్తి కాదు? ఒక దృగ్విషయం.ఆయన్ని ఓడించాలంటే ముందు ఆదృగ్విషయాన్ని అర్థం చేసుకోవాలి." అని కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ ఓ సందర్భంలో వ్యాఖ్యానించిన విషయం వీరు గుర్తు చేసుకోవచ్చు. ముందు నరేంద్రమోదీని ఓడించాలంటే.. ఆయన బలాలను గుర్తించాలి. బలహీనతలను గుర్తించాలి. కానీ ఇప్పుడున్న ప్రత్యర్థులకు అంత సామర్థ్యం లేదు. మోడీ కూడా విజయాలు వస్తున్నాయని ఎప్పుడూ నేల విడిచి సాము చేయలేదు. అదే ఆయనను అజేయుడిగా మారుస్తోంది.

## దళిత క్రైస్తవులకు సామాజిక న్యాయం అవసరం


**-ఏఐసీఎఫ్ జాతీయ కోఆర్డినేటర్ గద్దపాటి విజయ రాజు**



**మంథని,తెలంగాణ దిశ:** దళిత క్రైస్తవులకు సామాజిక న్యాయం అవసరం అని దానికోసం పది లక్షల గొంతులు ఏకమవ్వాలని ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ జాతీయ కోఆర్డినేటర్ గద్దపాటి విజయరాజు కోరారు. మంథని పట్టణంలోని శ్రీపాదకాలని సీయోను చర్చిలో నిర్వాహకులు అంకరి కుమార్, పల్లె శాంతిరాజ్ ఆధ్వర్యంలో క్రైస్తవ నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం క్రైస్తవ నాయకులతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ స్థాపకుడు నేషనల్ కోఆర్డినేటర్ గద్దపాటి విజయ రాజు మాట్లాడుతూ రాజు మాట్లాడుతూ 2007లో జస్టిస్ రంగనాథమిశ్రా కమిషన్ నివేదిక ప్రకారంగా దళిత నేపథ్యంలో ఉన్న క్రైస్తవులకు ఎస్సీ హోదాను బేషరతుగా కల్పించాలని అన్నారు. మతానికి కులానికి లంక పెట్టి చూడడం సరైన విధానం కాదని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం జస్టిస్ బాలకృష్ణ కమిటీని వేసి కాలయాపన చేస్తుండడం వల్ల దళిత క్రైస్తవులకు నష్టం జరుగుతుందని తెలిపారు. దేశ శ్రేయస్సు దృష్ట్యా రాజకీయాలలో దళిత క్రైస్తవ యువకులు చురుకుగా పాల్గొనాలని కోరారు. దళిత క్రైస్తవులకు అన్ని రాజకీయ పార్టీలు రాజకీయ అవకాశాలు కల్పించాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికలలో అన్ని రాజకీయ పార్టీలు దళిత క్రైస్తవులకు సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. 75 సంవత్సరాలుగా రాజ్యమే రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడటం ప్రపంచ చరిత్రలో మరెక్కడా లేదు, కేవలం ఇండియాలోనే ఈ విధంగా జరుగుతుందన్నారు. రాజ్యాంగం యస్.సి. లకు సమానంగా హక్కులు, అవకాశాలు కల్పించాలని సూచిస్తుంది కానీ మతం ఆధారంగా యస్.సి. లకు హక్కులు అవకాశాలు తృణీకరించబడటం రాజ్యాంగ ఉల్లంఘన కిందకే వస్తుందన్నారు. జస్టిస్ రంగనాథ్ మిశ్రా కమీషన్ నివేదిక ఆధారంగా దళిత క్రైస్తవులకు యస్.సి. హోదా కల్పించాల్సిన కేంద్ర ప్రభుత్వం, జస్టిస్ కే.జి. బాలకృష్ణన్ కమిటీ వేసి కాలయాపన చేస్తుందన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం క్రైస్తవుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని. దళిత క్రైస్తవులపై దాడులను కూడా నివారించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదే అన్నారు. సబ్ కా సాథ్ , సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్ అనే ప్రధాని నినాదం కేవలం మాటలకే పరిమితమయ్యిందన్నారు, దళిత క్రైస్తవులకు న్యాయం జరిగించుట ద్వారా మాత్రమే సమసమాజ వికాసం జరుగుతుందని కేంద్రం గుర్తించాలన్నారు. దళిత క్రైస్తవుల రాజ్యాంగపరమైన హక్కులు సాధించే వరకు పోరాటం ఆపేది లేదు, తెలంగాణ రాష్ట్రంలో పది లక్షల మంది దళిత క్రైస్తవ యువకులు తమ హక్కుల సాధన దిశగా అడుగులు వేస్తున్నారు. దళిత క్రైస్తవులపై దాడులను అరికట్టాలి. కుల సర్టిఫికెట్ జారీ చేసే విషయంలో యస్.సి.లను క్రైస్తవులంటూ సర్టిఫికెట్ నిరాకరిస్తున్న రెవిన్యూ సీంబ్బందిపై కఠినచర్యలు చేపట్టాలి ఈ కార్యక్రమంలో ఏఐసిఎఫ్ స్టేట్ కోఆర్డినేటర్ శాంతి కుమార్, మిల్లర్ మూన్, అహరోన్, డేవిడ్ మార్క్, మేకల మల్లేశం, ఎలీషా, జాన్ పాల్, శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వాసుపత్రిలో పరికరాలు ప్రారంభించిన కేంద్రమంత్రి బండి సంజయ్

**రూ. 1.5 కోట్ల విలువైన వైద్య పరికరాలు అందజేత**



**పేదలకు ఆర్థిక భారం పడకుండా వైద్యం అందించాలని సూచన**

**హుజురాబాద్,తెలంగాణ దిశ :**ప్రభుత్వ ఆసుపత్రులుకు వచ్చే పేద రోగులను టెస్టుల పేరుతో ప్రైవేట్ ఆసుపత్రులకు పంపొద్దని కేంద్రమంత్రి బండి సంజయ్ ప్రభుత్వాసుపత్రి వైద్యులకు సూచించారు. హుజురాబాద్ ప్రభుత్వాసుపత్రికి రూ. 1.5 కోట్ల సీఎస్ ఆర్ నిధులతో అందించిన వైద్య పరికరాలను సోమవారం ఆయన, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి ప్రారంభించారు. ఈసీజీ మిషన్, అల్ట్రాసౌండ్ మిషన్, మల్టిపురా మానిటర్, ఆటోక్లేవ్(లార్జ్), డయా థెర్మా మిషన్, అనెస్థిషియా వర్క్ స్టేషన్, ఈఎన్టీ హెడ్ లైట్, ఫెటల్ మానిటర్ సహా మొత్తం 15 వైద్య పరికరాలను అందించారు. అలాగే, గతంలో ఏర్పాటు చేసిన బోర్ మోటర్ ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ పేదవానికి ఉచితంగా వైద్యం అందేలా చూడాలని వైద్యులను కోరారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే పేదలకు రూపాయి ఖర్చు లేకుండా పూర్తి చికిత్స చేసి పంపేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమాలలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకట రమణ, డీసీహెచ్ ఎస్ డాక్టర్ కృష్ణ ప్రసాద్, హుజురాబాద్ ఆర్డీవో రవేష్ బాబు, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నారాయణ రెడ్డి, ఆర్ఎంవో డాక్టర్ ప్రసాద్, డిప్యూటీ డీఎంహెచ్వో డాక్టర్ చందు, హుజురాబాద్ మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, హుజురాబాద్ టౌన్ సీఐ కరుణాకర్, వైద్య సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# తగ్గిన భూముల ధరలు...

## కొనేందుకు 'నో' చెబుతున్న రియల్టర్లు..

**నిజామాబాద్,తెలంగాణ దిశ :** కామారెడ్డి జిల్లాలో 'భూమ్' దందా ఒక్కసారిగా విలవిలా పడింది. ఏడాది క్రితం అత్యధిక ధరలతో అమ్ముడుపోయిన భూముల అమాంతంగా పడిపోవడంతో రియల్ వ్యాపారులు ఆర్థికంగా చతికిలబడ్డారు. మధ్యవర్తితంగా కొనుగోలు చేసిన భూములు అమ్ముడుపోకపోవడంతో తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారు. ఏడాది క్రితం కోట్ల లోపలికిన భూముల ధర ప్రస్తుతం 40 శాతానికి తగ్గిపోవడంతో అనుకోవాలంటే అసలుకే నష్టం వస్తుందన్న ఆందోళన కలుగుతోంది.వ్యవసాయ భూములే కాకుండా ప్లాట్ల ధరలు కూడా తగ్గుముఖం పట్టడంతో రియల్ వ్యాపారులు తమ దందాను మూసుకునే పరిస్థితి ఏర్పడింది. మరి కొందరు వ్యాపారులైతే వడ్డీలు కట్టలేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. గతంలో జోరుగా సాగిన భూమ్ దందాతో ఆర్థికంగా బాగా స్థిరపడ్డ వ్యాపారులు తాజా పరిస్థితులతో కూడబెట్టుకున్న సొమ్మును వదులు కునే దుస్థితి ఏర్పడింది.టిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు భూముల ధరలు అమాంతంగా ఆకాశానంటాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక భూముల ధరలపై తీవ్ర ప్రభావం పడింది. ధరలు తగ్గుముఖం పట్టడంతో భూములు ప్లాట్లు అమ్ముకునేవారు ముందుకు రాకపోవడంతో రియల్ వ్యాపారానికి బ్రేక్ పడింది.కామారెడ్డి జిల్లా కేంద్రంతో పాటు బాన్సువాడ ఎల్లారెడ్డి పిట్లం బీర్కూర్ మదనూర్ జుక్కల్ ప్రాంతాల్లో భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. ఎకరం భూమి కోటి రూపాయలకు పైగా ధర పలుకుతుంది. ప్లాట్ల ధరలైతే గజానికి పదివేల నుండి 25 వేల రూపాయల వరకు ధర పలుకుతుంది. రోడ్ సైడ్ ప్లాట్ లకు ధర ఊహించే విధంగా పెంచేస్తున్నారు. పట్టణాలు మండల కేంద్రాలు ది నదినాభివృద్ధి చెందడంతో స్థలం ధరలు కూడా అడ్డగోలుగా పెరుగుతూ వస్తున్నాయి.ఆర్థికంగా పరిపుష్టి ఉంటే తప్ప వ్యవసాయ భూములు, ప్లాట్లు కొనుగోలు చేసే పరిస్థితి లేదు. మరికొన్ని చోట్ల గతంలో ఉన్న ధరలు ప్రస్తుతం కనిపించడం లేదు. ఒక్కసారిగా భూముల ధరలు పడిపోవడంతో అక్కడి వాసులు జాగల నమ్ముకోవాలంటేనే వెనుకడుగు వేస్తున్నారు. పట్టణాల



వైశాల్యం పెరుగుతుం డడం సమీప గ్రామాలను పట్టణంలో చేర్చడంతో జాగా ధర లక్షల నుండి కోట్లలోకి పెరిగి పోయింది. జిల్లాలో ఎల్లారెడ్డి బాన్సువాడ మున్సిపాలిటీగా మారడంతో భూముల ధరలపై ప్రభావం పడింది.ఫలితంగా భూముల అమ్మకాలు కొనుగోలు పూర్తిగా తగ్గుముఖం పట్టాయి. పదిమంది కలిసి రియల్ వ్యాపారంలో పెట్టుబడులు పెట్టేవారు. భూములను ప్లాట్లను కొనుగోలు చేసేటప్పుడు నామమాత్రంగా అడ్వాన్సులు చెల్లించి అట్టి వాటిని అధిక ధరలకు అమ్ముకొని సొమ్ము చేసుకునేవారు. వచ్చిన లాభాన్ని పదిమంది సమానంగా పంచుకునే పరిస్థితి ఉండేది. దీంతో రియల్ వ్యాపారం కొంతకాలం వరకు దండిగా నడిచింది. భూముల ధరలు ఆకాశాన్ని అంటడంతో విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న కొనుగోలు చేసేందుకు ఎవరు ముందుకు రాకపోవడంతో మిన్నకుండు పోవాల్సి వస్తుంది.రియల్ దందాకు అడ్డు కట్టబడడంతో వ్యాపారాన్ని మానుకొని పరిస్థితి నెలకొందని పలువురు రియల్ వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. పలుచోట్ల కొనుగోలు చేసిన భూములు ప్లాట్లు కూడా అమ్ముడుపోకపోవడంతో చేసిన అప్పులకు వడ్డీలు తడిసీమొపై రియల్ వ్యాపారులు ముఖం చాటిసి పరిస్థితి కూడా నెలకొంది. మరికొందరైతే ఈ దందాలో ఇరుక్కుపోయి అరసత్వంగా వచ్చిన భూములు జాగాలను కూడా అమ్ముకొని అప్పులు కట్టే పరిస్థితి కూడా దాపరించింది.రియల్ వ్యాపారం కుదరవడంతో రిజిస్ట్రేషన్లు సైతం తగు ముఖం పట్టాయి. భూముల కొనుగోలు అమ్మకాలు లేకపోవడంతో రియల్ వ్యాపారులతో సందడిగా కనిపించే రిజిస్ట్రేషన్ ఆఫీసులు వేలవేల బోతున్నాయి. రియల్ వ్యాపారం జోరుగా సాగే రోజుల్లో కార్యాలయాలు కిక్కిరిసి కనిపించేవి. రిజిస్ట్రేషన్‌ల కోసం క్రయవిక్రియ దారులు కార్యాలయాల ముందు పడిగాపులు కాచి స్థితి ఉండేది. ప్రస్తుతం భూము లు ధరల ప్రభావం పడడంతో సామాన్యులు కొనుగోలు చేసేందుకు జంకుతుండడంతో రిజిస్ట్రేషన్ శాఖ అధికారులకు బిజీ తగ్గింది.జరుగుతున్న క్రయవిక్రయాలకు కొన్ని మాత్రమే రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయని చెబుతున్నారు. ఇంతకుముందు 50 కి పైగా రిజిస్ట్రేషన్లు జరిగేవని, పది రిజిస్ట్రేషన్లు జరగాలంటేనే కష్టంగా ఉన్నట్లు వాపోతున్నారు. డాక్యుమెంటరీ ఫీజు, రిజిస్ట్రేషన్ ఫీజు తో కలిపి భారీగానే సొమ్ము సమకూరేది. అత్యధికంగా రెవిన్యూ అందించే శాఖ కార్యకలాపాలు తగ్గుముఖం పట్టడంతో ప్రభుత్వానికి, భారీగానే గండి పడుతుంది.

# కొట్టుమిట్టాడుతున్న మృణాల్..



హిందీ టీవీ సీరియల్ నటిగా కెరియర్ ఆరంభించి, ఆ తర్వాత నటిగా గుర్తింపు సొంతం చేసుకుంది మృణాల్ ఠాకూర్. తెలుగులో హను రాఘవపూడి దర్శకత్వంలో.. మలయాళ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ ప్రధాన పాత్రలో నేరుగా తెలుగులో నటించిన తొలి చిత్రం సీతారామం. ఈ సినిమాలో సీత పాత్రలో చాలా అద్భుతంగా ఒదిగిపోయి నటించింది మృణాల్ ఠాకూర్. తెలుగులో మొదటి సినిమానే అయినా.. ఆ సినిమాలోని పాత్రతో తెలుగువారి హృదయాలను దోచుకుంది. పైగా తెలుగు ఆడియన్స్ ఈమెను ఓన్ చేసుకున్నారు. తర్వాత నాచురల్ స్టార్ నాని హీరోగా నటించిన హాయ్ నాన్న సినిమాలో కూడా నటించి మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. ఆ తర్వాత విజయ్ దేవరకొండ హీరోగా వచ్చిన ది ఫ్యామిలీ స్టార్ సినిమాలో కూడా కథానాయికగా నటించింది కానీ ఈ సినిమా పెద్దగా వర్కౌట్ కాలేదు. ఇక ఈ సినిమా తర్వాత ఈమెకు తెలుగులో అవకాశాలు రాలేదు. పైగా దాదాపు ఐదు సంవత్సరాల సినీ కెరియర్లో రెండు చిత్రాలు తప్ప మరో సినిమా ఈమెకు విజయాన్ని అందించలేదు. అటు కథానాయికగాఎదిగిన బాలీవుడ్ లో కూడా వరుసగా ఎదురు దెబ్బలు తగులుతూనే వచ్చాయి. 2019లో హృతిక్ రోషన్ హీరోగా నటించిన సూపర్ 30 సినిమాతో మంచి బ్రేక్ అందుకున్న ఈమె.. ఆ తర్వాత ఒక్క సినిమాతో కూడా సక్సెస్ అందుకోలేకపోయింది. సూపర్ 30 తరువాత బాలీవుడ్ లో తూఫాన్, బాట్లా హౌస్, జెర్సీ,సెల్ఫీ, గుమ్రా, ఆంఖ్ మిచోలి, పిప్పా ఇలా పలు చిత్రాలు చేసింది. కానీ వరుస పరాజయాలే పలకరించాయి. ఇక ఇప్పుడు సన్నాఫ్ సర్దార్ 2లో కూడా నటించింది. అజయ్‌దేవగన్ హీరోగా నటించిన ఈ సినిమా కూడా గత శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ సినిమాకు ప్రీ రిలీజ్ బజ్ పెద్దగా లేకపోవడం వల్ల ఓపెనింగ్స్ రాలేదు. టికెట్ పై 50% ఆఫర్ పెట్టినా కూడా తొలిరోజు థియేటర్లలో జనం కనిపించకపోవడం, పైగా డివైడ్ టాక్ రావడంతో కలెక్షన్లు కూడా సాధించలేకపోయింది.

# సినిమా..

## ఉత్కంఠ భరితంగా బిగ్ బాస్ తెలుగు 9



కింగ్ నాగార్జున హోస్ట్‌గా కొనసాగుతున్న బిగ్ బాస్ తెలుగు 9 ఎపిసోడ్ ఉత్కంఠ భరితంగా సాగింది. సాధారణంగా ఎలిమినేషన్ ప్రక్రియ ఉండటంతో ఎవరు బయటకు వెళ్లబోతున్నారు అనే ఆసక్తి ప్రేక్షకుల్లో ఉరకలేసింది. అయితే చివర్లో ఎవరూ ఊహించని విధంగా భారీ ట్విస్ట్ చోటు చేసుకుంది. సండే ఎపిసోడ్‌లో మొదటగా హౌస్‌మేట్స్ కుటుంబ సభ్యులు, స్నేహితులు బిగ్ బాస్ డయాస్‌పైకి వచ్చారు. రీతూ చౌదరికి సపోర్ట్‌గా మాజీ కంటెస్టెంట్ అఖిల్ సార్థక్, ఆమె అన్నయ్య హాజరయ్యారు. రీతూ నెగిటివ్ వైబ్‌తో షోలోకి వచ్చినప్పటికీ, ఇప్పుడు ఆ నెగిటివిటీ మొత్తం పాజిటివ్‌గా మారిందని అఖిల్ ప్రశంసించాడు. అలాగే టాప్ 5గా రీతూ, తనూజ, కళ్యాణ్, ఇమ్మాన్యుయేల్, పవన్ నిలుస్తారని తన అంచనాలు వెల్లడించాడు.అనంతరం పవన్ తండ్రి, అతడి స్నేహితుడు డయాస్‌పైకి వచ్చి పవన్‌కు మోరల్ సపోర్ట్ ఇచ్చారు. ఈ సమయంలో పవన్ భావోద్వేగాలకు లోనయ్యాడు. తర్వాత తనూజకు సపోర్ట్‌గా బుల్లితెర నటి హరిత ఎంట్రీ ఇచ్చింది. ఇద్దరూ కలిసి నటించిన ముద్దమందారం సీరియల్ జ్ఞాపకాలు గుర్తు తెచ్చుకుని తనూజ కన్నీళ్లు పెట్టుకుంది.

ఎలిమినేషన్ రౌండ్‌లో కళ్యాణ్, సంజన, భరణి, దివ్య నామినేట్ అయ్యారు. వీరిలో కళ్యాణ్, భరణి ముందుగా సేవ్ అయ్యారు. చివరికి సంజన, దివ్య మాత్రమే మిగిలి ఉండగా, వారిని గార్డెన్ ఏరియాలోకి పంపించారు. ఈ సమయంలో నాగార్జున, ఇమ్మాన్యుయేల్‌ను పవర్ అస్త్ర గురించి ప్రశ్నించారు.

ఈ అస్త్రాన్ని వాడితే ఈ వారం ఎలిమినేషన్ పూర్తిగా రద్దవుతుందని చెప్పారు. ఇమ్మాన్యుయేల్ స్పష్టత తీసుకున్న తర్వాత పవర్ అస్త్ర వినియోగిస్తున్నట్లు ప్రకటించాడు. దీంతో నాగార్జున ఈ వారం ఎలిమినేషన్ రద్దయిందని అధికారికంగా ప్రకటించారు.

ప్రేక్షకుల ఓటింగ్ ప్రకారం దివ్య ఎలిమినేట్ అయ్యిందని నాగార్జున తెలిపారు. అయితే ఇమ్మాన్యుయేల్ పవర్ అస్త్ర ఉపయోగించడంతో దివ్య, సంజన ఇద్దరూ ఈ వారం సేఫ్ అయ్యారు. మొత్తానికి%ూ% సండే ఎపిసోడ్ బిగ్ ట్విస్ట్‌తో ముగిసింది. ఇమ్మాన్యుయేల్ పవర్ అస్త్ర వినియోగం షోలో కొత్త గేమ్ డైనమిక్స్‌ను తెచ్చింది. వచ్చే వారం ఎవరు నామినేట్ అవుతారు? ఎవరి గేమ్ హీట్ పెరుగుతుంది? అనేది ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.

## చిత్ర పరిశ్రమలో పనివేళలపై రష్మిక కీలక వ్యాఖ్యలు



చిత్ర పరిశ్రమలో పనివేళలపై కొంతకాలంగా జరుగుతున్న చర్చపై స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న స్పందించారు. ఎక్కువ గంటలు పనిచేయడం ఆరోగ్యానికి మంచిది కాదని, పరిశ్రమలో నటీనటుల నుంచి లైట్‌మ్యాన్ వరకు ప్రతి ఒక్కరికీ నిర్ణీత పనివేళలు ఉండాలని ఆమె అభిప్రాయపడ్డారు. తన కొత్త చిత్రం ప్రమోషన్లలో భాగంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆమె ఈ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా రష్మిక మాట్లాడుతూ.. "ఒక రోజులో నిర్ణీత సమయానికి మించి పనిచేయడం సరైంది కాదు. వ్యక్తిగతంగా నేను చాలా ఎక్కువ గంటలు పనిచేస్తాను. కంటి నిండా నిద్రపోయి చాలా నెలలు గడిచింది. కానీ, మీరు అలా చేయకండి. వీలైతే రోజుకు 9 నుంచి 10 గంటలపాటు నిద్రపోండి. సౌకర్యవంతమైన షెడ్యూల్ ప్లాన్ చేసుకోవడం భవిష్యత్తులో మనకు ఎంతో మేలు చేస్తుంది" అని తోటి నటీనటులకు సలహా ఇచ్చారు. "సినిమా పరిశ్రమలో కూడా నిర్దిష్టమైన పనివేళలు ఉండాలని నేను బలంగా కోరుకుంటున్నాను. ఇది కేవలం నటులకు మాత్రమే కాదు, దర్శకుల నుంచి సాంకేతిక సిబ్బంది వరకు అందరికీ వర్తించాలి. దానివల్ల ప్రతి ఒక్కరూ తమ కుటుంబంతో గడిపేందుకు సమయం దొరుకుతుంది.

నేను కూడా నా కుటుంబంపై మరింత దృష్టి పెట్టాలనుకుంటున్నాను. భవిష్యత్తు గురించే నా ఆలోచనలన్నీ. రేపు నేను తల్లి అయ్యాక పరిస్థితి ఎలా ఉంటుందో కూడా ఇప్పటి నుంచే ఊహించుకుంటున్నాను" అని రష్మిక పేర్కొన్నారు. కాగా,

8 గంటల పనివేళలు డిమాండ్ చేయడం వల్లే ప్రభాస్ 'స్పిరిట్' సినిమా నుంచి దీపికా పదుకొణె తప్పుకున్నారని ఇటీవల ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో రష్మిక వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో రష్మిక ప్రధాన పాత్రలో నటించిన 'ది గర్ల్ ఫ్రెండ్' చిత్రంలో దీక్షిత్ శెట్టి, అనూ ఇమ్మాన్యుయేల్ కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా నవంబరు 7న ప్రేక్షకుల ముందుకు రానుంది.

## మరోసారి హాట్ టాపిక్‌గా మృణాల్ ఠాకూర్ - ధనుష్ రిలేషన్ రూమర్స్




టాలీవుడ్‌లో వరుస విజయాలతో ఓ వెలుగు వెలుగుతున్న హీరోయిన్ మృణాల్ ఠాకూర్ మరోసారి తన పర్సనల్ లైఫ్ కారణంగానే వార్తల్లో నిలిచింది. సీరియల్స్‌తో కెరీర్‌ను ప్రారంభించిన ఆమె, జెర్సీ రీమేక్‌లో నటించి మంచి ప్రశంసలు అందుకుంది. తరువాత వచ్చిన సీతారామం, హాయ్ నాన్న చిత్రాలు ఆమెకు ప్రత్యేక గుర్తింపు తెచ్చాయి. అయితే, ప్రస్తుతం సినిమాల కంటే కూడా తమిళ స్టార్ హీరో ధనుష్‌తో రిలేషన్ షిప్ విషయంలో ఎక్కువగా వార్తలలో నిలుస్తుంది. ఇప్పటికే ధనుష్ తన భార్య ఐశ్వర్యతో విడాకులు తీసుకున్న విషయం తెలిసిందే. ధనుష్ డైవర్స్ తీసుకున్న తర్వాత మృణాల్ ఠాకూర్‌తో ఆయనకు ప్రేమ సంబంధం ఉందన్న వార్తలు మొదలయ్యాయి. మృణాల్ ఈ రూమర్లను ఖండించినప్పటికీ%ూ% ఇప్పుడు మరోసారి ఈ చర్చ మళ్లీ మొదలైంది.కారణం ఇన్‌స్టాగ్రామ్‌లో జరిగిన కామెంట్స్ ఎక్స్ఛేంజ్. మృణాల్ నటించిన 'దో దీవానే షెహర్ మే' సినిమా టీజర్ తాజాగా విడుదలైంది. దీనిని ఆమె ఇన్‌స్టాలో షేర్ చేయగా ధనుష్ ఆ పోస్ట్‌పై "చాలా బాగుంది" అనే అర్థంలో కామెంట్ చేశారు. దీనికి మృణాల్ లవ్ సింబల్‌తో రిప్లై ఇవ్వడంతో ఈ స్క్రీన్‌షాట్లు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.ఆ క్రమంలో నెటిజన్స్. ఇద్దరి మధ్య బంధం నిజమేనా?. త్వరలో కన్‌ఫాం చేస్తారా అంటూ కామెంట్స్ చేస్తున్నారు. ధనుష్, మృణాల్‌కి సంబంధించిన రూమర్స్ ఎప్పటి నుండో నెట్టింట హల్‌చల్ చేస్తున్నాయి. అయితే గతంలోనూ ఇదే ప్రచారం జరిగినప్పుడు మృణాల్ ఠాకూర్ ..తనకి ధనుష్ మధ్య అలాంటి సంబంధం ఏదీ లేదని స్పష్టం చేశారు. అయితే తాజా కామెంట్స్ ఎక్స్ఛేంజ్‌తో రూమర్స్ మళ్లీ ఊపందుకోవడం ఆసక్తిగా మారింది. ఈ విషయంపై ఇద్దరు సెలబ్రిటీలూ ఎలాంటి అధికారిక స్పందన ఇవ్వకపోవడంతో, చర్చ సోషల్ మీడియాలో వేడెక్కుతోంది. ఇక ఇదిలా ఉంటే ఈ ఏడాది ఇప్పటికే కుబేర, ఇడ్లీకొట్టు సినిమాలతో ప్రేక్షకుల్ని పలకరించిన ధనుష్.. ఈ నెల 28న 'అమరకావ్యం' చిత్రంతో ముచ్చటగా మూడోసారి రాబోతున్నారు.

## ఇండిగో విమానానికి తప్పిన పెను ప్రమాదం

ముంబయి : ఇండిగో విమానానికి పెను ప్రమాదం తప్పింది. ముంబయి నుంచి డెహ్రాడూన్ కు బయల్దేరిన ఇండిగో 6ఇ5032 విమానాన్ని మార్గం మధ్యలో ఆకస్మాత్తుగా ఓ పక్షి ఢీకొంది. అప్రమత్తమైన పైలట్.. వెంటనే విమానాన్ని అత్యవసర ల్యాండింగ్ చేశారు. ఈ క్రమంలో విమానం ముందు భాగం స్వల్పంగా దెబ్బతింది. అయితే.. ఈ ఘటనలో ప్రయాణికులంతా సురక్షితంగా బయటపడ్డారు. ఈ విషయాన్ని ఇండిగో సంస్థ అధికార ప్రతినిధి ఒకరు అధికారికంగా వెల్లడించారు. ఆ సమయంలో విమానంలో సుమారు 186 మంది ప్రయాణికులు ఉన్నట్టు తెలిపారు. ఈ క్రమంలో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా.. ప్రత్యామ్నాయంగా మరో విమానం ద్వారా సర్వీసును పునరుద్ధరించింది ఎయిర్ఇండియా. ఈ స్వల్ప విరామంలో ప్రయాణికులకు విమానయాన సిబ్బంది అల్పాహారం అందించినట్టు అధికారులు తెలిపారు.

## నెగిటివ్ రోల్ - పాజిటివ్ ఎనర్జీ

టాలీవుడ్‌లో మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా వస్తున్న విజువల్ వండర్ విశ్వంభర సినిమా పట్ల అభిమానుల్లో, సినీ వర్గాల్లో భారీ ఆసక్తి నెలకొంది. సోషియో ఫాంటసీ జోనర్‌లో రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్‌ని యంగ్ డైరెక్టర్ వశిష్ట తెరకెక్కిస్తు ండగా, యూవీ క్రియేషన్స్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది. మెగా స్టార్ సరసన త్రిష ప్రధాన కథానాయికగా కనిపించనుండగా, కన్నడ బ్యూటీ ఆశికా రంగనాథ్, కునాల్ కపూర్, ఇతరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. పాజిటివ్ ఎనర్జీ ఇచ్చిన నెగిటివ్ రోల్ ఇప్పుడు చిత్ర బృందం ఆశికా రంగనాథ్ పుట్టినరోజు సందర్భంగా స్పెషల్ పోస్టర్‌ను రిలీజ్ చేసింది.



ఈ పోస్టర్‌లో ఆశికా రంగనాథ్ సంప్రదాయ దుస్తుల్లో, చందమామ లాంటి మెరుపుతో అందంగా కనిపించారు. నెక్లెస్ చేతికి గాజులు, నుదుటి బొట్టు.. మొత్తం లుక్ ఆకర్షణీయంగా, కలర్‌ఫుల్‌గా ఉండటంతో ఈ క్యారెక్టర్‌పై ఇంట్రెస్ట్ పెరిగింది. ఆమె గ్లామర్ యాంగిల్‌ని హైలైట్ చేస్తూ రూపొందించిన పోస్టర్‌కు సోషల్ మీడియాలో మంచి రెస్పాన్స్ వస్తోంది. మెగా ఫ్యాన్స్ తో పాటు సాధారణ ఆడియన్స్ కూడా ఆశికా కొత్త లుక్‌పై పాజిటివ్ కామెంట్లు చేస్తున్నారు.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. rni. no: TELTEL/2023/88215